
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
సోమవారం 14 అక్టోబరు 2024



లక్కెవరిదో..!

నేడు మద్యం దుకాణాలకు లక్కీడ్రా

- చెన్నేకొత్తపల్లి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అత్యల్ప దరఖాస్తులు
- పరిగి, పుట్టపర్తి గ్రామీణంలో అత్యధికం
- అందరిచూపు పుట్టపర్తి వైపే..



పుట్టపర్తి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాలు ఎవరికి దక్కేనో.. ఆ లక్కు ఎవరిదో సోమవారం తేలనుంది. జిల్లాలో ప్రైవేటు మద్యం దుకాణాల లైసెన్సుల కేటాయింపునకు నేడు లక్కీ డ్రా తీయనున్నారు. జిల్లాలో ప్రైవేటు మద్యం దుకాణాలకు దరఖాస్తుల లెక్కతేలింది. 87 ప్రైవేటు మద్యం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరించారు. 11 రోజులపాటు కొనసాగిన ఈ ప్రక్రియ శుక్రవారం ముగిసింది. జిల్లావ్యాప్తంగా 1518 దరఖాస్తులు అందడంతో ప్రభుత్వానికి రూ.30.33 కోట్ల ఆదాయం కేవలం దరఖాస్తుల రూపంలోనే సమకూరింది. అధికార కూటమి నేతల ఒత్తిళ్లు, బెదిరింపులు, సిండికేట్‌తో దరఖాస్తుల పర్వం ముగిసింది. ఇక సోమవారం నిర్వహించే లక్కీడ్రాపై అందరిచూపు పడింది. మద్యం దుకాణాకు లక్కీడ్రాలో లక్కెవరిదోనన్న టెన్షన్ నెలకొంది. జిల్లాలో వచ్చిన దరఖాస్తుల్లో అత్యధికంగా రాజకీయ పార్టీ నేతలతోపాటు అనుచరగణమే ఉన్నట్లు తెలుస్తోంది. ఈనేపథ్యంలో లక్కీడ్రాలో ఎవరికి దుకాణం దక్కినా అందరికీ భాగమే అన్న చందగా మారింది. కొన్ని దుకాణాలకు మాత్రమే రాజకీయ పార్టీల నేతలతోపాటు మద్యం వ్యాపారంపై పట్టున్న ఔత్సాహిక వ్యాపారులు దరఖాస్తు చేశారు. జిల్లాలో కొన్నిచోట్ల సెంటిమెంట్‌గా మహిళల పేరుతో దాఖలు చేశారు. కొన్ని నియోజకవర్గాల్లో లాటరీ ద్వారా దుకాణం దక్కించుకున్నా.. వ్యాపారం ఎలా చేస్తారో చూస్తామంటూ బెదింపులతో కొందరు వెనుకడుగు వేసినా.. ఆన్‌లైన్‌లో గోప్యంగా సమర్పించారు. ఏ దుకాణానికి ఎవరు దాఖలు చేశారో విషయం తెలుసుకునే పనిలో కూటమి నేతల అనుచరణ వర్గం ఆరాతీస్తోంది. ఈప్రాంతాల్లో కూడా లక్కీడ్రా తరువాత కలిసి తలావాటాతో మద్యం దుకాణాలు నిర్వహించే పరిస్థితే కన్పిస్తోంది. ఐదేళ్ల తరువాత అమల్లోకి వచ్చిన నూతన మద్యం పాలసీ అధికార కూటమి నేతలతోపాటు వ్యాపారుల్లో కిక్కు పెంచుతున్న నేపథ్యంలో అందరి చూపు జిల్లాకేంద్రం పుట్టపర్తిలో నిర్వహించే లక్కీడ్రాపై పడింది.

చెన్నేకొత్తపల్లిలో అత్యల్పం

జిల్లాలో ఎనిమది ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 87 మద్యం దుకాణాలకు 1518 దరాఖాస్తులు వచ్చాయి. చెన్నేకొత్తపల్లి, ధర్మవరం, కదిరి, మడకశిర ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 19 దుకాణాలకు సింగిల్ డిజిట్ దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. హిందూపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పరిగిలో రెండు దుకాణాలకు 86 దరఖాస్తులు రాగా.. పుట్టపర్తి రూరల్‌లో రెండు దుకాణాలకు 85 వచ్చాయి. నగర పంచాయతీలో ఒక దుకాణానికి 39 దరఖాస్తులు చేయగా.. కర్ణాటక సరిహద్దులోని మడకశిర పరధి గుడిబండలో ఓ దుకాణానికి 33 వచ్చాయి. జిల్లాలో పుట్టపర్తి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పది దుకాణాలకు అత్యధికంగా 328 దరఖాస్తులు దాఖలయ్యాయి. ప్రతి దుకాణానికి పోటీపోటీగా సమర్పించారు. కదిరి, ధర్మవరం, హిందూపురంలో దుకాణాలకు దరఖాస్తు చేసేందుకు ఔత్సాహిక వ్యాపారులు వెనకడుగు వేసినట్లు నమోదైన దరఖాస్తులను బట్టి స్పష్టమవుతోంది. ఈ ప్రాంతాల్లో ఎవరికి లాటరీ తగిలినా అంతా సిండికేట్‌గానే నిర్వహించే పక్కా ప్రాణాళికతో దరఖాస్తులు చేశారు.

అందరి చూపు లక్కీడ్రా వైపే..

జిల్లాలో 87 మద్యం దుకాణాలకు స్వీకరించిన దరఖాస్తుల పరిశీలనను ఎక్సైజ్ శాఖాధికారులు పూర్తి చేశారు. జిల్లా కేంద్రం పుట్టపర్తిలోని సాయి ఆరామంలో కలెక్టర్ చేతన్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 8 గంటలకు లాటరీ ప్రక్రియ ప్రారంభమవుతుంది. దరఖాస్తుదారుల సమక్షంలో లక్కీడ్రా నిర్వహిస్తారు. డ్రాలో ఎంపికైన వారికి మద్యం దుకాణం లైసెన్సు కేటాయిస్తారు. దురఖాస్తుదారులను మాత్రమే లక్కీ డ్రాలోకి అనుమతిస్తారు. ఐదేళ్ల తరువాత అమల్లోకి వచ్చిన నూతన మద్యం పాలసీ అధికార కూటమి నేతలతోపాటు వ్యాపారుల్లో కిక్కు పెంచింది. ఈనేపథ్యంలో పోటీపోటీగా దుకాణాలకు దాఖలు చేసిన దరఖాస్తుదారులు.. లాటరీలో మద్యం దుకాణం ఒక్కటి దక్కినా చాలు అన్న భావనతో ఉన్నారు. సిండికేట్‌గా దరఖాస్తులు చేసిన వారిలో ఎవరికి లాటరీ తగిలినా వారే పంచుకునే విధంగా ఒప్పందాలు చేసుకున్నారు. తొలుత ధర్మవరం మున్సిపాలిటీ పరిధిలోని దుకాణాలకు లక్కీ డ్రా తీయనున్నారు. గుడిబండ దుకాణాలకు చివర్లో తీయనున్నారు.

ట్రాఫిక్ ఆంక్షలు

మద్యం దుకాణాల లాటరీ నేపథ్యంలో జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేయనున్నారు. 30 పోలీసు యాక్టు, 144 సెక్షన్ అమలులో ఉంటుందని జిల్లా పోలీసు కార్యాలయంప్రకటనలో తెలిపింది. ఆర్టీసీ బస్సులు మామిళ్ళకుంట నుంచి సూపర్ హాస్పిటల్, బ్రాహ్మణపల్లి, ఎనుమలపల్లి, చిత్రావతి బైపాస్‌రోడ్, కర్ణాటకనాగేపల్లి బ్రిడ్జి నుంచి పుట్టపర్తి పట్టణంలోకి వెళ్లాల్సి ఉంటుంది. కర్ణాటకనాగేపల్లినుంచి వచ్చేవారు చిత్రావతి బైపాస్‌రోడ్డు, ఎనుమలపల్లి, బ్రాహ్మణపల్లి, సత్యసాయి సూపర్ హాస్పిటల్, మామిళ్ళకుంటవైపు వెళ్లాల్సి ఉంటుందని పోలీసు వర్గాలు తెలిపాయి. దరఖాస్తుదారులు గ్యాస్ గొడౌన్, కోవెలగుట్టపల్లి క్రాస్ వద్ద వాహనాలు దిగి సాయిఆరామం వైపు వెళ్లాల్సి ఉంటుంది. వారి వాహనాలను అక్కడే పార్కింగ్ చేయాలి.

భారీ బందోబస్తు

పుట్టపర్తిరూరల్: జిల్లాకేంద్రంలోని సాయిఆరామంలో మద్యం దుకాణాల లక్కీడ్రా నిర్వహించనున్న నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సాయిఆరామంలో జిల్లా ఎస్పీ రత్న.. పోలీసు, ఎక్సైజ్ శాఖాధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. లాటరీ ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తలును తెలియజేశారు. దరఖాస్తుదారులు, వారి తరఫున ఆథరైజ్డ్ వ్యక్తులు, వారి సెల్ఫ్ అటెస్టేషన్ ఐడెంటిటీ కార్డు కలిగిన వారికి మాత్రమే అనుమతి ఉంటుందన్నారు.



ఊరేగుతున్న శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి

ఘనంగా దసరా



పెనుకొండలో అమ్మవారి విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం

కదిరి, అక్టోబరు 13: విజయ దశమిని జిల్లావ్యాప్తంగా శనివారం ఘనంగా చేసుకున్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజులపాటు అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పదోరోజు విజయదశమి చేసుకున్నారు. దేవాలయాలకు పెద్దఎత్తున జనం పోటెత్తారు. ఉదయం నుంచే ఆలయాల వద్ద బారులుతీరారు. ఇళ్లలో ప్రత్యేక పూజలు చేసుకున్నారు. పలుచోట్ల అమ్మవారి ఉత్సవాలు నిర్వహించారు.

ఖాద్రీశుడి దర్శనానికి పోటెత్తిన జనం

పట్టణంలో శ్రీఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో దసరా ఉత్సవాల్లో భాగంగా శ్రీవారు శనివారం ప్రత్యేకాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నిత్య కైంకర్యాలు, అలంకరణ అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారు విజయదశమి సందర్భంగా ఆలయం నుంచి ఊరేగింపుగా రాయచోటి రోడ్డులోని దసరా మండపానికి చేరుకున్నారు. అక్కడి నుంచి శమీపూజ, ఆస్థాన పూజలను ఆలయ అర్చకులు నిర్వహించారు. అనంతరం స్వామివారు అశ్వవాహనంపై గ్రామోత్సవంగా ఆలయానికి చేరుకున్నారు.

ముగిసిన యజ్ఞం



పూర్ణాహుతితో యజ్ఞాన్ని ముగిస్తున్న పండితులు

పుట్టపర్తి, అక్టోబరు 13: విశ్వశాంతికోసం స్థానిక ప్రశాంతి నిలయంలో చేపట్టిన వేదపురుష సప్తాహ జ్ఞానయజ్ఞం శనివారం ఉదయం పూర్ణాహుతితో ముగించారు. పూర్ణచంద్రహాల్‌లో వారం రోజులపాటు యజ్ఞాన్ని భక్తితో నిర్వహించారు. యజ్ఞాన్ని వీక్షించడానికి వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. యజ్ఞపునీత జలాన్ని భక్తులపై చల్లి పండితులు ఆశీర్వదించారు. సాయంత్రం సాయికుల్వంతు మందిరంలో విద్వాన్‌కుమరేష్ డాక్టర్ జయంతి బృందం వీణ, తవలా వాయిద్యంతో భక్తులను అలరింపజేసింది. విద్యార్థులు భక్తిగీతాలను ఆలపించారు. అనంతరం సంగీత కళాకారులను ట్రస్టు సభ్యుడు చక్రవర్తి సన్మానించారు.



సంగీత కచేరి నిర్వహిస్తున్న భక్తులు

అప్రమత్తంగా ఉండండి

వర్షాల నేపథ్యంలో అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

పుట్టపర్తి, అక్టోబరు 13: జిల్లాలో రానున్న 4 రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందనీ, అందరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ టీఎస్ చేతన్.. అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ... బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మూడు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిందన్నారు. ఆ మేరకు ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. డివిజన్, మండలాలు, మున్సిపల్ అధికారులు అప్రమత్తంగా ఉండి చర్యలు తీసుకోవాలన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేశామనీ, ప్రజలు ఎవరూ రావద్దని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ కుమార్, డీఆర్ఓ కొండయ్య, ఏఎస్పీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పంట కోతలు వద్దు

పుట్టపర్తిరూరల్: భారీ వర్ష సూచన నేపథ్యంలో ఉద్యాన రైతులు అప్రమత్తంగా ఉండాలనీ, పంట కోతలు వద్దని జిల్లా ఉద్యాన శాఖాధికారి చంద్రశేఖర్ ప్రకటనలో సూచించారు. చీనీ, బొప్పాయి ఇతర పండ్ల తోటల్లో నీరు నిల్వ ఉండకుండా కాలువలను తీసుకోవాలన్నారు. అరటితోటల రైతులు పెనుగాలులకు చెట్లు పడిపోకుండా కట్టెల సాయంతో ఊతం ఏర్పాటు చేసుకోవాలనీ, గెలలను ముందుగానే కోసి విక్రయించుకోవాలన్నారు. టొమాటోకు మచ్చతెగులు సోకకుండా మందుజాగ్రత్తగా 2.5 గ్రాములు ఎం 45, గ్రాము కార్బెండిజియం లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు.

అంగన్‌వాడీలు జాగ్రత్తలు తీసుకోవాలి

పుట్టపర్తిరూరల్: భారీ వర్ష సూచన నేపథ్యంలో అంగన్‌వాడీలు అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ పీడీ నాగమల్లీశ్వరి ప్రకటనలో పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు శిథిలావస్థలో ఉంటే రెండు, మూడురోజులపాటు నడపవద్దన్నారు. సమీపంలోని అనుకూల భవనాల్లోకి మార్చుకోవాలన్నారు. పిల్లలను చలిగాలిలో తిప్పరాదన్నారు.

వర్షానికి కూలిన సిద్ధేశ్వరస్వామి

ఆలయ ప్రహరీ



కూలిన ప్రహరీ

అమరాపురం, అక్టోబరు 13: మండలంలోని హేమావతి గ్రామంలో వెలసిన పవిత్ర పుణ్యక్షేత్రమైన హేమావతి హెంజేరు సిద్దేశ్వరస్వామి ఆలయ ప్రహరీ శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కూలింది. దేవాలయం కేంద్ర పురావస్తు శాఖ పరిధిలో ఉండడంతో నిర్మాణాలకు మరమ్మతులు చేసేందుకు అనుమతుల్లేవు. దీంతో పురాతన కట్టడాలు శిథిలావస్థకు చేరి, కూలిపోతున్నాయి. దేవాలయం ప్రాంగణంలో ఉన్న దొడ్డేశ్వర స్వామి ఆలయం పక్కన ఉన్న ప్రహరీ కూలిపోవడంతో భద్రతాపరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. తక్షణమే సంబంధిత అధికారులు దీనిపై దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు. దొడ్డేశ్వరస్వామి ఆలయం పక్కన ఉన్న మల్లేశ్వరస్వామి దేవాలయ గోపురం కూడా కూలడానికి సిద్ధంగా ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. తక్షణమే మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.



కూలడానికి సిద్ధంగా ఉన్న గోపురం

కట్టడి ఏదీ..?

- బహిరంగ ప్రదేశాల్లో యథేచ్ఛగా మద్యపానం
- గ్రామాల్లో రోడ్ల పక్కనే సిట్టింగులు
- అర్ధరాత్రి దాటినా తగ్గని హంగామా
- పుట్టుకొస్తున్న కొత్త నేరాలు
- చోద్యం చూస్తున్న పోలీసులు



కొడికొండ చెక్‌పోస్టు నుంచి కోట్లోపల్లికి వెళ్లే రోడ్డు పక్కనే బహిరంగ ప్రదేశంలో పడేసిన ఖాళీ మద్యం సీసాలు



చిలమత్తూరు, అక్టోబరు 13: చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం మన పోలీసులకే చెల్లుతుంది. నేరం జరిగిన తరువాత నేర పరిశోధన, దర్యాప్తునకు పరుగులు పెడుతున్నారే తప్ప.. వాటి నివారణకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలను పట్టించుకోవడం లేదు. ప్రతి నేరంలో ప్రధాన పాత్ర మద్యం పోషిస్తోంది. అటువంటి మద్యం బహిరంగ ప్రదేశాల్లో విచ్చలవిడిగా తాగుతూ.. ఆపై ఊగుతున్నా వారిని పట్టించుకున్న పాపానపోలేదు. దాంతో నేరాల సంఖ్య పెరగడంతోపాటు బాధితుల ప్రాణాలు, ఆస్తులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది.

బహిరంగ ప్రదేశాల్లోనే మద్యపానం

మద్యానికి అలవాటుపడిన వారు ఎక్కడ పడితే అక్కడ కూర్చుని సేవిస్తున్నారు. నిబంధనల ప్రకారం మద్యాన్ని ఇళ్లకు తీసుకెళ్లి తాగాలి. అనుమతులు ఉన్నచోట తాగాలి. అలాకాకుండా గుంపులు గుంపులుగా యువకులు ఒకచోట చేరి మద్యం సేవిస్తున్నారు. జనసంచార ప్రదేశాల్లోనే బహిరంగంగా తాగడం పట్ల ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఇలా తాగేసి.. వారిలో వారికే గొడవలు పుట్టుకొస్తున్నాయి. మరి కొందరు ఇతర నేరాలకు మద్యం మత్తులో ప్రణాళికలు వేసుకుని, అమలుచేస్తున్నారు. దీంతో కొత్త నేరాల పుట్టుకకు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం ఒక కారణమవుతుందనే చెప్పాలి.

రోడ్ల పక్కనే సిట్టింగులు

మధ్యాహ్నం దాటితే చాలు గ్రామీణ ప్రాంతాల్లో మద్యం బాబులు హల్‌చల్ చేస్తున్నారు. గ్రామాలకు వెళ్లే రోడ్ల పక్కనే చెట్ల కింద సిట్టింగ్‌లు వేస్తున్నారు. చిలమత్తూరు మండలం కర్ణాటకకు సరిహద్దుగా ఉండటంతో కర్ణాటక మద్యం ఎక్కువగా తీసుకువచ్చి విచ్చలవిడిగా తాగేస్తున్నారు. పంట పొలాలను ఎంచుకొని బహిరంగ ప్రదేశాల్లో కానిచ్చేస్తున్నారు. పొలాల్లో పనిచేసుకునే మహిళలు ఈ మందుబాబులను చూసి ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ పనులకు వెళ్లే వారు ఇంటికి చేరుకునేవరకు భయంతో వణుకుతున్నారు. కొడికొండ చెక్‌పోస్టును ప్రధాన కేంద్రంగా చేసుకుని, మద్యం బాబులు గ్రామాలకు వెళ్లే దారులకు ఎంచుకుంటున్నారు. అలాంటి ప్రదేశాల్లో అయితే పోలీసుల నుంచి ఇబ్బంది ఉండదని భావించి రోడ్డు పక్కనే కూర్చుని పీకల వరకు తాగి హంగామా చేస్తున్నారు.

హద్దేలేని హంగామా

బహిరంగ ప్రదేశాల్లో, రోడ్ల పక్కనే తాగేవారు అర్ధరాత్రి దాటినా ఇళ్లకు వెళ్లకుండా చీకటిలోనే నానా హంగామా చేస్తున్నారు. ఇటీవల కొడికొండ చెక్‌పోస్టు నుంచి కోట్లోపల్లికి వెళ్లే మట్టిరోడ్డు పక్కనే మందుబాబుల హంగామా ఎక్కువైందని ఆ గ్రామస్థులు పేర్కొంటున్నారు. కొడికొండ చెక్‌పోస్టు నుంచి కోట్లోపల్లికి వచ్చే రహదారి పలు గ్రామాలకు ప్రధాన రోడ్డు. దీంతో ప్రజలు రాత్రి పొద్దుపోయే వరకు ఈ మార్గం గుండా ప్రయాణిస్తుంటారు. ఈ రోడ్డు పక్కనే చీకట్లో కూడా మందుబాబులు మద్యం సేవిస్తూ హంగామా చేస్తుండటంతో ప్రయాణికులు భయాందోళనలు చెందుతున్నారు. మద్యం సేవించిన వారు మత్తులో ఏ దుర్మార్గానికి ఒడిగడుతారోనని వణికిపోతున్నారు.

నేరాలక స్కెచ్

మద్యం మత్తులో ఉన్న సమయంలో వారు విచక్షణ కోల్పోయి, నేరాలకు పాల్పడుతున్నారు. మహిళలపై దాడులు, దారిదోపిడీలు, చోరీలు, గొడవలు ఇలా నేరాలకు బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం కారణమవుతోంది. ఇటీవల పొలాల్లో చోరీలు ఎక్కువవుతున్నాయి. విద్యుత్ మోటార్ల స్టార్టర్లు, కేబుల్ వైర్ల, ఇతర యంత్ర సామగ్రిని ఎత్తుకెళ్లడం హెచ్చుమీరాయి. వ్యవసాయ పనులు చేసుకునే మహిళలు వెంట మగమనిషి ఉంటేనో, లేక గుంపులుగా అయితేనే వ్యవసాయ పనులకు కదులుతున్నారు. ఈ మందుబాబులతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని క్షణక్షణం భయపడుతున్నారు.

పట్టించుకోని పోలీసులు

నేరం జరిగిన తరువాత వచ్చే పోలీసులు ముందస్తు చర్యలు తీసుకోవడంలో తీవ్రంగా విఫలమవుతున్నారు. ఎక్సైజ్ చట్టం ప్రకారం బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నేరం. దానికితోడు జనసంచార ప్రదేశాల్లో గుంపులుగా కూర్చుని సేవించడం అతి పెద్ద నేరం. ఇటువంటి చర్యల వల్లనే నేరాలు పెరుగుతున్నాయన్న విషయం పోలీసులకు తెలిసినా కట్టడి దిశగా వారు అడుగులు వేయలేదు. కనీసం గ్రామానికి సంబంధించిన పోలీసు కానిస్టేబుల్ రాత్రి సమయంలో బీట్ తిరగకపోవడంతో మందుబాబుల అగడాలు మితిమీరాయి. మద్యం సేవించి నేరాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. కనీసం బహిరంగ ప్రదేశాల్లో, పొద్దుపోయిన తరువాత మద్యం సేవించేవారిపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. గ్రామాల్లో సైతం మద్యం సేవించిన వారితోనే కొత్త సమస్యలు పుట్టుకు వస్తున్నాయి. సాధారణంగా పోలీసులు రాత్రి సమయంలో గస్తీ తిరిగితే కొంత వరకు దారి దోపిడీలు, చోరీలు, దారుణాలు తగ్గుముఖం పడతాయి. మండలంలో మాత్రం పోలీసుల గస్తీ ఎక్కడా కనపడలేదు. దీంతో ఇటీవల నేరాల సంఖ్య పెరుగుతోందని స్థానికులు వాపోతున్నారు.

చక్కటి అవకాశం ఓపెన్ స్కూల్

నెలాఖరు వరకు టెన్త్, ఇంటర్ ప్రవేశాలు



విద్యార్థులకు దూరవిద్యపై అవగాహన కల్పిస్తున్న ఏడీ లాజర్

కొత్తచెరువు, అక్టోబరు 13: ఆసక్తి ఉన్నా.. కుటుంబ పరిస్థితుల కారణంగా అనేకమంది చదువుకు దూరమవుతుంటారు. అలాంటి వారికి చేయూతనిచ్చి వారిని తిరిగి చదువు వైపు మళ్లించేందుకు ప్రభుత్వం ఓపెన్ స్కూల్ విద్యావిధానాన్ని అమలు చేస్తోంది. ఇందులో 14 ఏళ్లు నిండిన వారికి చదవడం, రాయడం వస్తే పదో తరగతిలో అడ్మిషన్ కల్పిస్తారు. ఇంటర్‌లో చేరాలనుకునే వారికి 16 ఏళ్లు ఉండి 10వ తరగతి ఉత్తీర్ణులవ్వాలి. ఇందుకోసం గత నెల చివరి వరకు అడ్మిషన్లు చేపట్టింది. జిల్లావ్యాప్తంగా ఓపెన్ ఇంటర్, టెన్త్‌కు దాదాపు 852 మంది అడ్మిషన్లు పొందారని ఆ శాఖ ఏడీ లాజర్ తెలిపారు. మరింతమంది విద్యార్థులకు అడ్మిషన్లు పొందేందుకు అవకాశం కల్పించాలన్న ఉద్దేశ్యంతో అపరాధ రుసుంతో ఈనెల 30వతేదీ వరకు అవకాశం కల్పించామన్నారు.

జిల్లావ్యాప్తంగా ఓపెన్ ఇంటర్ 69, టెన్త్ 39 స్టడీ సెంటర్లను ప్రభుత్వం నిర్వహిస్తోంది. అన్ని హైస్కూల్ కావడంతో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా వారికి వీలైనప్పుడు తరగతులకు హాజరయ్యే అవకాశం కల్పించింది. ఆన్‌లైన్ తరగతులు కూడా చెబుతున్నారు. అడ్మిషన్లు పొందిన వారికి ప్రభుత్వమే పుస్తకాలు, స్టడీ మెటీరియల్ అందిస్తోంది. కనీసం 24 తరగతులకు హాజరైన వారిని మాత్రమే పరీక్షలకు అనుమతి ఇస్తున్నారు. ఇంటర్‌లో సైన్స్ గ్రూపులలో ప్రవేశం పొందినవారు కనీసం 48 ప్రాక్టికల్ తరగతులకు హాజరు కావాల్సి ఉంటుంది. రికార్డులు, అసైన్‌మెంట్లు తప్పకుండా రాయాలి.

రెగ్యులర్ సర్టిఫికెట్‌తో సమానమే..



రెగ్యులర్ పాసైన వారికే ప్రభుత్వ, ఇతర ప్రైవేటు సంస్థలలో ప్రాధాన్యత ఉంటుందనీ, ఓపెన్ స్కూల్ వారికి అలా ఉండదన్న అపోహ చాలామందిలో ఉంటుంది. అది వాస్తవం కాదు. ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్ కూడా అన్ని రకాల ఉద్యోగాలకు ఉపయోగపడుతుంది.

-లాజర్, విద్యాశాఖ ఏడీ

కార్యకర్తల కోసం...

మద్యం షాపులకు టెండర్లు

దరఖాస్తు రుసుం చెల్లించిన ఎమ్మెల్యే అమిలినేని


ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, అక్టోబరు 13: 'ఎన్నికల్లో నా కోసం ఎంతో శ్రమించారు. ఇప్పుడు సమయం వచ్చింది. నా వంతుగా మీ అభివృద్ధికి కృషి చేస్తా' అన్న రీతిలో టీడీపీ కార్యకర్తల సంక్షేమానికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు నడుం బిగించారు. ఈ నేపథ్యంలో కార్యకర్తలకు ఇవ్వడానికి తన సొంత డబ్బుతో మద్యం షాపులకు టెండర్లు వేశారు. నియోజకవర్గంలోని కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం టౌన్, కళ్యాణదుర్గం రూరల్ పరిధిలో సుమారు 10 మద్యం షాపులకు ఎమ్మెల్యే తన సొంత నిధులతో టెండర్లు వేశారు. మద్యం షాపులకు దరఖాస్తు చేయడానికి రుసుం రూ.2 లక్షలు (నాన్ రిఫండబుల్) చెల్లించాలి. నియోజకవర్గ కార్యకర్తల తరపున 10 మద్యం షాపులకు 75 మందితో సొంత డబ్బు చెల్లించి దరఖాస్తు చేయించారు. లాటరీ పద్ధతిలో ఎన్ని మద్యం షాపులు వస్తే, వాటినన్నింటినీ కష్టపడ్డ కార్యకర్తలకే ఇవ్వనున్నారు. దీంతో నియోజకవర్గ వ్యాప్తంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పట్ల హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. ఉచిత డీఎస్సీ శిక్షణ, ఉచిత డ్రైవింగ్, నిరుపేదలకు తోపుడు బండ్ల పంపిణీ, ఆలయాలకు విరాళాలు, ఉచిత వైద్య సదుపాయాలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఆర్థికసాయం పంపిణీ, కంబదూరులో నిరుపేదల ముస్లిం కుటుంబానికి పక్కాగృహం నిర్మాణం కోసం రూ. 5 లక్షలు పంపిణీ చేస్తూ నియోజకవర్గ అభివృద్ధిలో అమిలినేని తన వంతు కృషి చేస్తున్నారు.

పశువుల కంటైనర్ బోల్తా

రెండు ఆవులు, రెండు ఎద్దుల మృతి

ధర్మవరంరూరల్, అక్టోబరు 13: కబేళాకు తరలిస్తున్న కంటైనర్ వాహనం బోల్తాపడి నాలుగు పశువులు మృతిచెందగా మరికొన్ని తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని సీతారాంపల్లి క్రాస్ సమీపంలో 44వ జాతీయరహదారిపై ఆదివారం తెల్లవారుజామున ఈ సంఘటన జరిగిందని వారు తెలిపారు. అనంతపురం నుంచి బెంగళూరుకు ఆవులు, ఎద్దులతో వెళ్తున్న కంటైనర్ వాహనం మార్గమధ్యంలోని సీతారంపల్లి క్రాస్ కేఎఫ్‌సీ వద్దకు రాగానే అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నాలుగు పశువులు అక్కడికక్కడే మృతిచెందగా, మరో 8 తీవ్రంగా గాయపడ్డాయి. స్థానికులు ద్వారా విషయం తెలుసుకున్న ధర్మవరంరూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లారు. అప్పటికే కంటైనర్ డ్రైవర్, క్లీనర్ పరారయ్యారు. ఈ ప్రమాదంలో రెండు ఆవులు, రెండు ఎద్దులు మృత్యువాత పడగా, మరికొన్ని పరుగులు తీశాయి. మండల పశువైద్యాధికారి శేఖర్ అక్కడికి వెళ్లి గాయపడిన వాటికి వైద్యచికిత్సలు అందించి పోతులనాగేపల్లి వద్ద ఉన్న గోశాలకు తరలించారు. మృతిచెందిన వాటిని పోస్టుమార్టం చేసి పూడ్చిపెట్టారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.


ఆవులు, ఎద్దులను పట్టుకునేందుకు సంచరిస్తున్న ముఠా


ఆవులు, ఎద్దుల కళేబరాలు

మూగరోదన

కంటైనర్ బోల్తాపడటంతో ఆవులు, ఎద్దులు ఒకదానిమీద ఒకటి పడ్డాయి. ఊపిరిరాడక కొన్ని, కాళ్లు, కొమ్ములు విరిగి మరికొన్ని తీవ్రంగా గాయపడ్డాయి. తెల్లవారుజామున కావడంతో జనసంచారం లేక ఆవుల మెడకు చుట్టుకున్న తాళ్లు తెంపేవాళ్లు లేక ఆ మూగజీవాలు మూగరోదనతో మృత్యువాతపడ్డాయి. గాయపడ్డ మరికొన్ని ఆవులు తీవ్ర రక్తస్రావంతో రోదించాయి. ఉదయం సంఘటనా స్థలానికి వెళ్లిన స్థానికులు ఆ పరిస్థితిని చూసి చలించిపోయారు.


బోల్తాపడిన కంటైనర్

యథేచ్ఛగా పశువులు తరలించే ముఠా సంచారం

ఆవులు, ఎద్దులను కొనుగోలు చేసి బెంగళూరు తదితర ప్రాంతాల్లోని కబేళాలకు తరలించే ముఠా సభ్యులు ప్రమాదం విషయం తెలియగానే బెంగళూరు నుంచి సంఘటనా స్థలానికి వచ్చారు. కంటైనర్ వాహనంలో ఉండే ఎద్దులు, ఆవులు కొన్ని పొలాల్లోకి పారిపోయాయని తెలుసుకుని, వాటిని పట్టుకునేందుకు పొలాల్లో సంచరించారు. బెంగళూరు నుంచి కేఏ 53ఎంఈ 1011ఇన్నోవా వాహనంలో దాదాపు 10మంది మామిళ్లపల్లి, సీతారాంపల్లి, దాదులూరు, ముచ్చురామి గ్రామాల పొలాల్లో ఆవులను, ఎద్దులను పట్టుకునేందుకు సంచరించారు. ఆవుల ముఠా యథేచ్ఛగా అక్కడికి వచ్చిన ఆవులు, ఎద్దులను తరలించేందుకు సంచరిస్తున్నారని సమాచారం తెలిసినప్పటికీ పోలీసులు పట్టించుకోకపోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అత్త, కోడలిపై అత్యాచారం

- అఘాయిత్యానికి పాల్పడిన పాత నేరస్థులు
- తండ్రీకొడుకులను కత్తులతో బెదిరించి ఘాతుకం
- చోరీ చేసి వస్తూ అకృత్యానికి పాల్పడిన వైనం
- పోలీసుల అదుపులో ఐదుగురు నిందితులు
- మరొకరి కోసం గాలింపు..
- దుండగుల్లో ముగ్గురు మైనర్లు

హిందూపురం, అక్టోబరు 13: చిలమత్తూరు మండలంలో నిర్మాణ దశలో ఉన్న ఓ మిల్లు వాచ్‌మన్ కుటుంబంపై శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత దారుణం జరిగింది. ద్విచక్రవాహనాల్లో వచ్చిన ఆరుగురు దుండగులు అత్తా కోడలిపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. అర్ధరాత్రి దాటాక సోమందేపల్లి మండలంలో ఒకచోట చోరీకి పాల్పడిన ఆరుగురు దుండగులు మూడు ద్విచక్రవాహనాల్లో కంబాలపల్లి వైపు నుంచి టేకులోడు వైపు బయల్దేరారు. మిల్లు సమీపంలోకి రాగానే ద్విచక్రవాహనాలు ఆపారు. ఇదే సమయంలో అక్కడ వాచ్‌మన్ టార్చ్‌లైట్ వేసి చూశాడు. దాంతో దుండగులు వాచ్‌మన్ వద్దకు వెళ్లి తాగునీళ్లు అడిగారు. అతడికి అనుమానం వచ్చి కొంత దూరంలో నీటి తొట్టి ఉందని చెప్పాడు. కానీ నీటి తొట్టితో మాకేం పని అంటూ వారు వాచ్‌మన్ కుటుంబం నివాసం ఉన్న రేకుల షెడ్డు వైపు వెళ్లారు. అడ్డుకునేందుకు యత్నించిన వాచ్‌మన్‌ను బెదిరించడంతో అతడు గట్టిగా కేకలు వేశాడు. దీంతో షెడ్డులో ఉన్న అతడి భార్య, కుమారుడు, కోడలు బయటికి వచ్చారు. చోరీకి వచ్చారని అనుమానించిన వాచ్‌మన్ కుటుంబం ఇక్కడ సీసీ కెమెరాలు ఉన్నాయని చెప్పడంతో వాటిని ధ్వంసం చేశారు. తర్వాత అత్తా కోడలిని వేర్వేరు గదుల్లోకి లాక్కెళ్లారు. మిగిలిన వారు తండ్రీ కొడుకులను కత్తితో బెదిరించి, చితకబాదారు. దీంతోవారు నిస్సహాయస్థితిలో ఉండిపోయారు. కుమారుడి వద్ద ఉన్న సెల్ ఫోన్ లాక్కొన్నారు. దుండగుల్లో ఇద్దరు తండ్రీ కొడుకులను బంధించి ఉంచగా మిగిలిన వారు ఒకరి తరువాత ఒకరు అఘాయిత్యానికి పాల్పడ్డారు. దాదాపు ఒకటిన్నర గంట పాటు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఏడాదిన్నర చిన్నారి బోరున విలపిస్తున్నా పట్టించుకోకుండా దమనకాండకు ఒడిగట్టారు.

చోరీ చేసి వస్తూ అఘాయిత్యం

హిందూపురానికి చెందిన అంతర్రాష్ట్ర నేరస్థుడు, సుమారు 60కి పైగా కేసులు ఉన్న దొంగతో పాటు మరో ఇద్దరు పాత నేరస్థులు, ముగ్గురు మైనర్లు ద్విచక్ర వాహనాల్లో శుక్రవారం సోమందేపల్లికి వెళ్లారు. అక్కడ చోరీ చేసుకుని 44వ జాతీయ రహదారిపై షార్ట్‌కట్ మార్గంలో కంబాలపల్లి మీదుగా వస్తున్నారు. ఈ సందర్భంలో నల్లబొమ్మనపల్లి, కంబాలపల్లికి మధ్య రోడ్డు పక్కనే నిర్మాణమవుతున్న ఓ మిల్లు వద్ద ద్విచక్రవాహనాలను ఆపారు. ఈ సమయంలో అక్కడే ఉన్న కుక్కలు అరవడంతో కాపలా ఉన్న వాచ్‌మన్ అటువైపు టార్చ్‌లైట్ వేసి చూశాడు. అంతే దుండగులు అక్కడకు వెళ్లి దారుణానికి ఒడిగట్టారు. దుండగులు అక్కడ నుంచి వెళ్లిపోయిన అనంతరం ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని కుమారుడు సమీపంలో ఉన్న కంబాలపల్లికి వెళ్లి గ్రామస్థులకు విషయం తెలిపి, మిల్లు మేనేజర్‌కి సమాచారం అందించాడు. మేనేజర్ అక్కడికి చేరుకొని జరిగిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. డీఎస్పీ మహేష్, ఇన్‌చార్జ్ సీఐ అబ్దుల్ కరీమ్‌లు సంఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితులను హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న జిల్లా ఎస్పీ రత్న ఘటనా స్థలానికి చేరుకొని బాధితులతో మాట్లాడారు. వివరాలు తెలుసుకున్న అనంతరం హిందూపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. పోలీసులు ఘటనా స్థలంలో నిందితుల ఆచూకీ కోసం క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ని రప్పించారు. ఆ ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నిందితుల వేలుముద్రలను సేకరించారు. అయితే నిందితుల్లో ఒకరిద్దరు మాస్కులు, చేతులకు గ్లౌజ్‌లు ధరించినట్లు తెలిసింది. అనంతరం దుండగులను పట్టుకునేందుకు డీఎస్పీ మహేష్, సీఐ ఆంజనేయుల ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.



ధ్వంసమైన సీసీ కెమెరాలు

గంజాయి మత్తులోనేనా..?

సామూహిక అత్యాచారానికి పాల్పడిన నిందితులు గంజాయి సేవించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఈ ఘటనకు ఒడిగట్టినట్లు తెలుస్తోంది. గత ఐదేళ్ల వైసీపీ పాలన నుంచి హిందూపురం ప్రాంతంలో గంజాయి విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. దీంతో పాత నేరస్థులు గంజాయికి అలవాటు పడ్డారు. ఆ మత్తులో చోరీలతో పాటు ఇలాంటి అత్యాచారాలకు ఒడిగట్టుతున్నట్లు తెలుస్తోంది.

రంగంలోకి దిగిన పోలీసులు

అత్తాకోడలపై అత్యాచారానికి పాల్పడిన దుండగులను పట్టుకోవడానికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా ఎస్పీ నాలుగు బృందాలను ఏర్పాటు చేసి రంగంలోకి దించారు. వారు ఘటన జరిగిన ప్రదేశంలో సాంకేతిక పరమైన అంశాలతో పాటు అక్కడ ఉన్న సీసీ ఫుటేజ్ ఆధారంగా మొదట నిందితులను గుర్తించారు. అందులో ఉన్న అనుమానితులను బాధిత కుటుంబానికి చూపించి, అనంతరం దర్యాప్తుని వేగవంతం చేశారు. శనివారం రాత్రికే నిందితుల్లో ఐదుగురిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. అయితే అఘాయిత్యానికి పాల్పడిన వారు ముగ్గురు పాత నేరస్థులు కాగా, మరో ముగ్గురు మైనర్లు అని తెలిసింది. వీరిలో ఒకరు పరారీలో ఉన్నారు. కానీ వీరంతా హిందూపురం పట్టణానికి చెందిన వారేనని పోలీసులు గుర్తించినట్లు సమాచారం. వీరు గత ఐదేళ్లుగా విచ్చలవిడిగా నేరాలకు పాల్పడినట్లు సమాచారం.

పదుల సంఖ్యలో అఘాయిత్యాలు

అత్తాకోడలిపై అత్యాచారానికి పాల్పడిన నిందితులు గత ఐదేళ్లలో చిలమత్తూరు ప్రాంతంలో ఒంటరిగా వెళుతున్న వారిపై దాడి చేసి దోచుకున్నారు. పదుల సంఖ్యలో మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడినట్లు కూడా పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. కానీ బయటకి చెప్పితే ఎక్కడ తమ పరువు పోతుందోనని బాధితులు ఇప్పటి వరకు చెప్పకపోవడం గమనార్హం.

రహస్యంగా విచారణ

అదుపులోకి తీసుకున్న నిందితులను హిందూపురం కాకుండా వేరే ప్రాంతానికి తీసుకెళ్లి రహస్యంగా విచారిస్తున్నారు. పోలీసుల విచారణలో భయంకరమైన వాస్తవాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది.

ఆందోళనలో పల్లె వాసులు

కాగా గ్రామీణ ప్రాంతాల్లో రైతులు కొంతమంది పొలాల వద్ద బోర్లు వేసుకొని, కొందరు అక్కడే నివాసం ఉంటున్నారు. అయితే ఈ ఘటన వెలుగులోకి రావడంతో గ్రామీణ ప్రాంతాల్లో ఊరికి దూరంగా నివాసాలున్న కుటుంబాల్లో ఆందోళన మొదలైంది. అంతేకాక పోలీసుల విచారణలో వెల్లడైన అంశాలు బయటికి తెలిస్తే మరింత ఆందోళన చెందే అవకాశం ఉంది.

ఎంట్రీ పాస్ ఉంటేనే అనుమతి

- ఉదయం 7 గంటల్లోపే జేఎన్‌టీయూకు చేరుకోండి
- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

అనంతపురం అర్బన్, అక్టోబరు 13 : మద్యం షాపులకు దరఖాస్తు చేసుకున్న వ్యాపారులను ఎంట్రీ పాస్ ఉంటేనే జేఎన్‌టీయూలోకి అనుమతి స్తామని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగద్దయ్య, సూపరింటెండెంట్ రామ మోహన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం 7 గంటల్లోపే జేఎన్‌టీయూ ఎన్టీఆర్ ఆడిటోరియానికి దరఖాస్తుదారులు చేరుకోవాలన్నారు. డౌన్‌లోడ్ చేసిన దరఖాస్తు సెట్‌తోపాటు ఎంట్రీ పాస్, ఆధార్ లేదా ఇతర గుర్తింపు కార్డు తప్పని సరిగా తీసుకురావాలన్నారు. దరఖాస్తు చేసుకునే సమయంలోనే ఎంట్రీ పాస్ డౌన్‌లోడ్ చేసుకొని ఉంటారన్నారు. కలెక్టర్ వినోద్ కుమార్ పర్యవేక్షణలో అత్యంత పకడ్బందీగా మద్యం షాపులకు దరఖాస్తుదారు ల సమక్షంలోనే లాటరీ తీస్తామని పేర్కొన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని దరఖాస్తుదారులు అందరూ తప్పని సరిగా 7 గంటలకు చేరుకోవాలని కోరారు.

గ్యాంగ్ రేప్ అమానుషం: ఎంపీ బీకే

పెనుకొండ, అక్టోబరు 13: చిలమత్తూరు మండలం నల్లబోయనపల్లి గ్రామానికి బళ్లారి నుంచి ఉపాధి కోసం వచ్చిన వాచ్‌మెన్, అతని కుమారున్ని కత్తులతో బెదిరించి వారి భార్యలపై అత్యాచారానికి పాల్పడిన సంఘటన అమానుషమని ఎంపీ బీకే పార్థసారథి ఆవేదన వ్యక్తం చేశారు. అత్యాచారానికి పాల్పడిన దుండగులను వదిలే ప్రశ్నేలేదన్నారు. ఈ సంఘటనపై ముఖ్యమంత్రి కూడా సీరియస్ అయ్యారన్నారు. దోషులను వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలన్నారు. బాధితులకు టీడీపీ అండగా ఉంటుందన్నారు.

మహిళలకు రక్షణ కల్పించండి: మాజీమంత్రి

హిందూపురం, అక్టోబరు 13: కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మహిళలకు రక్షణ లేకుండా పోయిందని వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ అన్నారు. చిలమత్తూరు మండలంలో జరిగిన ఘటనకు సంబంధించి బాధితులను పరామర్శించేందుకు ఆమె హిందూపురం వచ్చారు. ఈ సందర్భంగా పట్టణ టూటౌన్ సీఐ కరీంని కలిశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు. కానీ అక్కడ బాధితులను పరామర్శించేందుకు పోలీసుల అనుమతి లేకపోవడంతో విలేకరులతో మాట్లాడారు. అత్తా కోడలిపై జరిగిన ఘటన దురదృష్టకరమన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో హిందూపురం వైసీపీ ఇన్‌చార్జ్ దీపిక, వేణురెడ్డి, పొగాకు రామచంద్ర నాయకులు పాల్గొన్నారు.

తుంగభద్రకు భారీ వరద.. తెరుచుకున్న గేట్లు


విడుదలవుతున్న నీరు

బళ్లారి సిటీ, అక్టోబరు 13: కర్ణాటకలో భారీ వర్షాలు కురుస్తుండటంతో తుంగభద్ర నదికి వరద పెరిగింది. హొస్పేట్ సమీపంలోని తుంగభద్ర జలాశయానికి (టీబీ డ్యాం)కి 84,504 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. డ్యాం నిండుగా ఉండటంతో 82,504 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఇందులో దాదాపు 11వేల క్యూసెక్కులు కాలువలకు, 20 క్రస్ట్‌గేట్ల ద్వారా 71 వేల క్యూసెక్కులు నదికి వదులుతున్నారు. తుంగభద్ర బోర్డు అధికారులు శనివారం తొలుత 18 గేట్లను తెరిచారు. తర్వాత మరో రెండింటిని తెరిచారు. ఇన్‌ఫ్లో పెరిగితే లక్ష క్యూసెక్కుల నీటిని విడుదల చేసే అవకాశం ఉందని బోర్డు వర్గాలు వెల్లడించాయి. ఈ ఏడాది జలాశయం నుంచి నదికి నీటిని వదలడం ఇది మూడోసారి. జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 1632 అడుగులుకాగా.. ప్రస్తుతం 1631.97 అడుగుల మేర నీరు ఉంది. డ్యాంలో ప్రస్తుతం 101.66 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

మెడికల్ షాపు నిర్వాహకుడి ఆత్మహత్య

ధర్మవరం, అక్టోబరు 13: అప్పులబాధ తాళలేక మెడికల్ షాపు నిర్వాహకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో శనివారం జరిగింది. సిద్ధయ్యగుట్టకు చెందిన శ్రీనివాసులు (40) మెడికల్ ఏజెన్సీ, మందుల షాపు నిర్వహిస్తున్నాడు. వీటి నిర్వహణకు అప్పులు చేశాడు. వ్యాపారం సరిగా జరగకపోవడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలి అంటూ మథన పడేవాడు. దసరా పండుగ రోజు భార్య సంగమేశ్వర ఆలయానికి వెళ్లి వస్తానని వెళ్లింది. దీంతో ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని శ్రీనివాసులు ఆత్మహత్య చేసుకున్నాడు. గుడి నుంచి వచ్చిన అతడి భార్య తలుపులు తట్టినా తీయకపోవడంతో పొరుగు వారికి తెలిపింది. వారు వచ్చి తలుపులు బద్దలు కొట్టారు. ఇంట్లోకి వెళ్లగానే ఉరికి వేలాడుతున్న భర్త శ్రీనివాసులును చూసి ఆమె బోరున విలపించింది. స్థానికుల సమాచారంతో వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మార్కెట్‌కు తగ్గిన టమోటా

అనంతపురంరూరల్, అక్టోబరు 13: కక్కలపల్లి మార్కెట్‌కు ఆదివారం టమోటా దిగుబడులు తగ్గాయి. మార్కెట్‌లోని అన్ని మండీలకు కలిపి 225 టన్నుల టమోటా కాయల వచ్చాయి. దసరా పండుగ నేపథ్యంలో మార్కెట్‌కు కాయలు తగ్గినట్లు తెలుస్తోంది. కాగా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.55తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. కిలో సరాసరి ధర రూ.44, కనిష్ఠ ధర రూ.36 పలికినట్లు తెలిపారు.

నీటికోసం రైతుల వాగ్వాదం


తూము వద్ద ఉన్న రైతులు

నార్పల, అక్టోబరు 13: మండలంలోని హెచ్చెల్సీ తూము వద్ద శనివారం రాత్రి నీటి కోసం కూరగానిపల్లి, వెంకటాంపల్లి రైతుల వాగ్వాదానికి దిగారు. కూరగానపల్లి హెచ్చెల్సీ తూము వద్దకు వెంకటాంపల్లి రైతులు చేరుకున్నారు. తూము వద్ద తమకు నీరు రాకుండా కూరగానిపల్లి రైతులు అడ్డుకట్ట వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న కూరగానిపల్లి రైతులు తూము వద్దకు చేరుకున్నారు. దీంతో ఆ రెండు గ్రామాల రైతుల మధ్య వాగ్వాదం జరిగింది. చివరకు తూము వద్ద వేసిన అడ్డుకట్టను వెంకటాంపల్లి గ్రామస్థులు తొలగించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. నీటి విషయంలో ఎమ్మెల్యే చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

భర్తను చంపిన భార్య అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రెడ్డప్ప

ధర్మవరంరూరల్, అక్టోబరు 13: రూరల్ మండలంలోని ధర్మపురి గ్రామానికి చెందిన గోవిందు హత్య కేసును పోలీసులు చేదించారు. వివాహేతర సంబంధం నేపథ్యంలో ఈ హత్య జరిగినట్లు ధర్మవరం రూరల్ సర్కిల్ ఇన్‌చార్జి, టూటౌన్ సీఐ రెడ్డప్ప, బత్తలపల్లి ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. హత్యకు సంబంధించిన వివరాలను ఆదివారం వెల్లడించారు. ధర్మపురి గ్రామానికి చెందిన గోవిందు, అంజినమ్మ భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. అందరికి పెళ్లిళ్లు అయిపోయాయి. అయితే కొన్నేళ్లుగా గోవిందుకు మరో మహిళతో వివాహేతర సంబంధం ఉందని అంజినమ్మ అనుమానిస్తుండేది. గోవిందు కూడా భార్య పట్ల అనుమానంతో ఉండేవాడు. ఈ విషయంగా వారి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈక్రమంలో ఈనెల 10న మధ్యాహ్నం వారు మరోమారు గొడవకు దిగారు. తన గొంతుపట్టుకున్న భర్తను రోకలిబండతో అంజినమ్మ కొట్టింది. గోవిందు మృతి చెందాడు. 12న రావులచెరువు క్రాస్ సమీపంలో అంజినమ్మను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచగా రిమాండ్ విధించిందని పోలీసులు తెలిపారు.

పశువుల సంత ఆదాయం రూ.3.45లక్షలు

అనంతపురంరూరల్, అక్టోబరు 13: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశువులసంతతో రూ.3,45,200 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా మార్కెట్‌కు రూ.2,15,000, ఆదివారం జరిగిన గేదెలు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1,30,200 వచ్చిందని తెలిపారు.

చిచ్చురేపిన శిలాఫలకాలు, విగ్రహాల ధ్వంసం

మద్దలచెరువులో ఇరువర్గాల వాగ్వాదం

కనగానపల్లి, అక్టోబరు 13: ప్రశాంతంగా ఉన్న గ్రామంలో శిలాఫలకాలు, విగ్రహాల ధ్వంసాలు ఇరువర్గాల మధ్య వివాదానికి కారణమైంది. గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి మద్దలచెరువు గ్రామంలో టీడీపీ వర్గీయుల శిలాఫలకాన్ని, వైఎస్సార్, మద్దలచెరువు సూరి విగ్రహాలను పాక్షికంగా ధ్వంసం చేశారు. దీనిపై శనివారం ఉదయం టీడీపీ, వైసీపీ వర్గీయులు వాగ్వాదానికి దిగారు. ఈ సంఘటనలపై పరస్పరం ఫిర్యాదులు చేశారు. ఈ నేపథ్యంలో కనగానపల్లి పోలీసులు గ్రామానికి వెళ్లి బందోబస్తు ఏర్పాటు చేసి విచారణ చేపట్టారు.

సీమ కవిత్వసారానికి ప్రతిబింబాలు

పుస్తకావిష్కరణ సభలో వక్తలు


పుస్తకావిష్కరణ చేస్తున్న సాహితీవేత్తలు

అనంతపురం కల్చరల్, అక్టోబరు 13: రచయితలు వెంకటకృష్ణ, శ్రీనివాసగౌడ్ రచించిన రవ్వలసవ్వడి, రాయలసీమ సాహితీ విమర్శ రచనలు సీమ కవిత్వసారానికి ప్రతిబింబాలని వక్తలు పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని ఉపాధ్యాయ భవన్‌లో డాక్టర్ అంకె శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సభలో పుస్తకాలను ముఖ్య అతిథులు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ రాయలసీమ సాహిత్యానికి, విమర్శకు కొత్త చేర్పు ఈ రచనలని అన్నారు. సభలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి, డాక్టర్ నాగేశ్వరాచారి, సీనియర్ రచయితలు తూముచెర్ల రాజారాం, ఉర్దూ యూనివర్సిటీ ప్రొఫెసర్ జీవీ రత్నాకర్, కంబదూరి షేక్ నబీరసూల్, తరిమెల అమర్నాథరెడ్డి, గోసల నారాయణస్వామి, చేగువేరా హరి, మధురశ్రీ, మిద్దె మురళీకృష్ణ, అశ్వత్థరెడ్డి, టీవీ రెడ్డి, కటకం కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

గొల్లపల్లి రిజర్వాయర్‌లో పడి వ్యాపారి మృతి


మృతిచెందిన అనీసుల్లాఖాన్

పెనుకొండరూరల్, అక్టోబరు 13: మండలంలోని గొల్లపల్లి రిజర్వాయర్‌లో పడి పండ్ల వ్యాపారి అనీసుల్లాఖాన్(41) మృతిచెందాడు. కియ పోలీసులు తెలిపిన మేరకు హిందూపురం మండలం నింకంపల్లికి చెందిన అనీసుల్లా పండ్ల వ్యాపారం చేస్తూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో ఈయన కుటుంబ సభ్యులతో కలిసి పెనుకొండకు వచ్చారు. ఆదివారం సరదాగా కుటుంబ సభ్యులతో కలిసి గొల్లపల్లి రిజర్వాయర్‌ను సందర్శించడానికి వెళ్లారు. కాలువ నీటిలో అనీసుల్లా కుమారుడు సరదాగా ఈత కొడుతుండగా ఒక్కసారిగా మునిగాడు. అతన్ని రక్షించే క్రమంలో ప్రవాహంలో కొట్టుకపోయి రిజర్వాయర్ నీటిలో పడి మృతిచెందాడు. స్థానికులు హుటాహుటిన అతన్ని వెలికి తీసినా అప్పటికే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య షమీమ్‌ఖాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు కియ ఎస్ఐ రాజేష్ తెలిపారు. మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు సురక్షితంగా బయటపడ్డాడు.

సెలవుల కోసం వచ్చి గల్లంతు..

మండలంలోని గొల్లపల్లి రిజర్వాయర్‌లో పడి అమ్మవారిపల్లికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి(19)అనే డిగ్రీ విద్యార్థి ఆదివారం గల్లంతయ్యాడు. అమ్మవారిపల్లి గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు చంద్రశేఖర్‌రెడ్డి అనంతపురంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో డిగ్రీ సెకెండియర్ చదువుతున్నాడు. దసరా సెలవుల్లో భాగంగా స్వగ్రామానికి వచ్చాడు. చంద్రశేఖర్‌రెడ్డి తన స్నేహితులతో కలిసి ఆదివారం మధ్యాహ్నం గొల్లపల్లి రిజర్వాయర్‌కు వెళ్లాడు. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి గొల్లపల్లి రిజర్వాయర్‌కు ఇటీవలే నీరు విడుదల చేశారు. తన స్నేహితులతో కలిసి చంద్రశేఖర్ రెడ్డి రిజర్వాయర్‌కు వస్తున్న కాలువలో ఈత కొడుతుండగా నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాడు. స్నేహితులు, గ్రామస్థులు అరుపులు, కేకలు వేస్తుండగా నీటిలో గల్లంతయ్యాడు. గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించగా కియ పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ వెంకటరమణ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్లతో మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6.30వరకు గాలించారు. ఫైరింజన్ సిబ్బంది కూడా నీటిలో గాలించినా ప్రయోజనం లేకపోయింది. చీకటిపడటంతో వెనుతిరిగారు. విద్యార్థి ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆర్తనాదాలు పెట్టారు.


రిజర్వాయర్‌లో గల్లంతైన విద్యార్థిని గాలిస్తున్న దృశ్యం

క్లుప్తంగా ...

పనిభారం తగ్గించాలి

ధర్మవరం, అక్టోబరు 13: ఆర్టీసీలో ఉద్యోగుల పనిభారాన్ని వెంటనే తగ్గించాలని ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగార్జునరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు చేపట్టిన నిరసన కార్యక్రమం ఆదివారానికి ఎనిమిదో రోజుకు చేరుకుంది. నిరసనలో నాయకులు ముస్తాఫా, బాబు, శివమ్మ, శంకర పాల్గొన్నారు.

యోగాశిక్షణ శిబిరం ప్రారంభం

కొత్తచెరువు, అక్టోబరు 13 : స్థానిక సత్యసాయి భజన మందిరంలో జనతా సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత యోగా శిక్షణా శిబిరాన్ని ఆదివారం ప్రారంభించారు. యోగా గురువు తుమ్మల నారాయణరెడ్డి మాట్లాడుతూ.. నెల రోజులపాటు ఈ యోగా తరగతులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో జనతా సొసైటీ సభ్యులు అరుణ్‌ప్రశాంత్, శివసాయి, గణేశ్, రవిశంకర్ పాల్గొన్నారు.

రేషన్‌షాపు ప్రారంభం

ధర్మవరంరూరల్, అక్టోబరు 13: మండలంలోని వసంతపురం ఎస్సీ కాలనీలో రేషన్ షాపును ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు గొర్తి శంకర్‌నాయుడు, బట్టాపెద్ద కాటమయ్య, ఉప సర్పంచ్ నాగేంద్రప్రసాద్, బట్టా అశ్వర్థ నాయుడు, ఎన్‌టీ నాయుడు, డీలర్ మల్లికార్జున పాల్గొన్నారు.

నేడు అన్న క్యాంటీన్ ప్రారంభం

తనకల్లు, అక్టోబరు 13: కదిరిలో అన్నక్యాంటీన్‌ను ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ సోమవారం ప్రారంభిస్తున్నారని, మండలంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని దీన్ని విజయవంతం చేయాలని మండల కన్వీనర్ రెడ్డిశేఖర్‌రెడ్డి ఓ ప్రకటలో కోరారు. మదనపల్లి రోడ్డులోని పీఆర్ గ్రాండ్ కల్యాణ మండపం నుంచి అన్న క్యాంటిన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఓబుళదేవరచెరువు, అక్టోబరు 13: రాష్ట్ర ప్రభుత్వం సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ వారి ఉత్తర్వుల మేరకు ఎస్టీ, ఎస్సీ అభ్యర్థులకు ఉచిత డీఎస్సీకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎస్సీ ఇంటిగ్రెటెండ్ హాస్టల్ వార్డెన్ రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచిత భోజన, వసతి సౌకర్యంతో మూడు నెలలపాటు ఈ శిక్షణ ఉంటుందని, ఆన్‌లైన్ ద్వారా ఈనెల 21 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

ఐరన్, కాపర్‌వైర్ చోరీ

కదిరి అర్బన్, అక్టోబరు 13: మండలంలోని వరిగిరెడ్డిపల్లి వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైర్, ఐరన్ శనివారం చోరీ అయ్యాయి. గుర్తు తెలియని దుండగులు ట్రాన్స్‌ఫార్మర్‌లోని 1360 కిలోల కాపర్, 900 కేజీల ఐరన్ చోరీ చేసినట్లు రూరల్ సీఐ మోహన్ ఆదివారం తెలిపారు. ఎలక్ట్రికల్ ఏఈ నరేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

నేటి నుంచి పల్లె పండుగ

గాండ్లపెంట, అక్టోబరు 13 : మండలంలో సోమవారం నుంచి ఈనెల 20 వరకు పల్లె పండుగ, పంచాయతీ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి ఆదివారం తెలిపారు. ఉపాధి పథకం నిధులతో మండలంలోని 14 పంచాయతీల్లో సీసీరోడ్లు, మట్టిరోడ్లు, పలు అభివృద్ధి పనులు చేపడతామని, అందులో భాగంగా ఆయా గ్రామాల్లో భూమి పూజ నిర్వహిస్తామని తెలిపారు. 14న చామాలగొంది, వేపరాల, 15న జీన్లకుంట, గాండ్లపెంట, 16న గొడ్డివెలగల, టి. పెద్దతండా, 17న మల్లమీదపల్లి, కటారుపల్లి, 18న సోమయాజులపల్లి, తూపల్లి, 19న తుమ్మలబైలు, మద్దివారిగొంది. 20న గాజులవారిపల్లి పెద్దతండా, కురమామిడి పంచాయతీల్లో వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఆయా పంచాయతీ అధికారులు, ఉపాధి సిబ్బంది, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈలు హాజరుకావాలన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

ధర్మవరం, అక్టోబరు 13: చిలమత్తూరు మండలంలో వాచ్‌మన్ కుటుంబ సభ్యులపై అత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వన్‌టౌన్ ఎస్ఐ గోపీకుమార్‌కు నాయకులు ఎస్‌హెచ్ బాషా, జేవీ రమణ, అయూబ్‌ఖాన్, శేషంపల్లి మారుతీ, నాగార్జున ఆదివారం వినతిపత్రం అందజేశారు.

కదిరి అర్బన్ : చిలమత్తూరు వద్ద అత్తా, కోడలిపై సామూహిక అత్యాచారం చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని సీపీఎం నాయకులు పట్టణ సీఐ నారాయణరెడ్డికి ఆదివారం వినతిపత్రం అందించారు. ఇలాంటి సంఘటనలకు పాల్పడిన వారిని బహిరంగంగా ఉరితీయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జగన్మోహన్, రామమోహన్, ముస్తాక్, బాబ్‌జాబ్, నారాయణ, అంజనేయులు, రఫీక్ పాల్గొన్నారు.

కంట్రోల్ రూం ఏర్పాటు

కదిరి అర్బన్, అక్టోబరు 13: భారీ వర్షాలు కురిసే అవకాశమున్న నేపథ్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ మురళీక్రిష్ణ తెలిపారు. కంట్రోల్ రూం సేవలు 24 గంటలూ అందుబాటులో ఉంటాయన్నారు. సమస్యలు వస్తే వెంటనే 94938 13546, 91105 07161, 89855 92593, 97051 98689, 96182 79069, 90144 52243, 94903 60861 ఫోన్ చేయాలన్నారు.

తనకల్లు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ శోభాసువర్ణమ్మ తెలిపారు. వాతావరణ శాఖ , కలెక్టర్ ఆదేశాల మేరకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. మూడు రోజులపాటు అధిక వర్షాలు వచ్చే అవకాశం ఉండడంతో మండలంలోని లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమస్యలు ఏర్పడితే వెంటనే 9491987580- 8247861164కు వెంటనే సమాచారం అందించాలన్నారు.

కొత్తచెరువు : మండలంలో మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని, కావున లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ నీలకంఠారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే కంట్రోల్ రూం ఫోన్ నెంబరు 78932 40304 లేదా తహసీల్దార్ 94931 88862 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

నంబులపూలకుంట: రాయలసీమ ప్రాంతంలో నాలుగు రోజుల పాటు తుఫాన్ వలన భారీగా వర్షాలు కురిసే అవకాశంతో ఉందని తహసీల్దార్ నరేంద్రకుమార్ పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో అయన మాట్లాడారు. పిడుగులు పడే అవకాశలున్నాయని, పాతభవనలు, చెట్లు, వంక, వాగులు, ఆరుబయట ఉండకూడని ప్రజలకు సూచించాలని వివరించారు. సమస్యలు ఏర్పడితే ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంకు 9885642926 ఫోన్ చేయాలన్నారు. కోత దశలో ఉన్న పంటను తొలగించకూడదన్నారు. వరి పంటలు నీరు నిలువ లేకుండా చూసుకోవాలన్నారు.

15శాతం కమీషన్ ఇవ్వాల్సిందే

ఆ సొమ్మును గ్రామాల అభివృద్ధికి ఖర్చు చేస్తాం

మద్యం వ్యాపారులకు జేసీపీఆర్ హెచ్చరిక

పెద్దవడుగూరు, అక్టోబరు 13: నియోజకవర్గంలో మద్యం దుకాణాలు దక్కించుకున్నవారు ఆదాయంలో 15శాతం గ్రామాల అభివృద్ధికి తప్పనిసరిగా ఇవ్వాలని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలకేంద్రంలోని చౌడేశ్వరి అమ్మవారిని శనివారం దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. వైసీపీ నాయకులు ప్రభుత్వ ధనం, సహజ వనరులను అప్పనంగా దోచేశారని మండిపడ్డారు. మండలంలోని కొందరు వైసీపీ నాయకులు అధికార గర్వంతో విచ్చలవిడిగా భూ ఆక్రమణలు, ప్రభుత్వ నిధుల దుర్వినియోగం, సెటిల్‌మెంట్లు, ఇసుక రవాణా, బెల్ట్‌షాపుల ద్వారా జేబులు నింపుకున్నారన్నారు. వారి నుంచి వడ్డీతో కలిపి అక్రమార్జన సొమ్ము వసూలుచేసి గ్రామాల అభివృద్ధికి ఖర్చు చేస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఐదుకల్లు సదాశివన్‌కు నివాళి

అనంతపురంరూరల్, అక్టోబరు 13: హరిజనోద్ధరణకు ఆహర్నిశలు శ్రమించిన మహోన్నతుడు ఐదుకల్లు సదాశివన్ అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ పేర్కొన్నారు. ఐదుకల్లు సదాశివన్ వర్ధంతిని పురస్కరించుకుని సీపీఐ మండల సహాయ కార్య దర్శి నరేష్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్, జిల్లా కార్యదర్శి జాఫర్ హాజరయ్యారు.

ధరల దడ..!

- కొండెక్కిన నిత్యావసరాల రేట్లు
- వంట నూనెలు.. సలసల
- కూరగాయల ధరలూ అంతే
- కందిపప్పు కిలో రూ.165





ధర్మవరం / ఓబుళదేవరచెరువు, అక్టోబరు 13 : నిత్యావసరాల ధరలు దౌడు తీస్తున్నాయి. సామాన్య కుటుంబాలకు చుక్కలు చూపిస్తున్నాయి. గోరుచుట్టుపై రోకటి పోటు అన్నట్టు... సరుకుల ధరలతో కూరగాయల ధరలు పోటీపడుతున్నాయి. నిన్నా.. మొన్నటి వరకు అందుబాటులో ఉన్న వాటి ధరలు నేడు ఆకాశాన్ని అంటుతున్నాయి. వరదల వల్ల ఉత్పత్తి తగ్గిపోవడమే ఇందుకు కారణమని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం నూనెల దిగుమతులపై సుంకం పెంచడంతో కొద్ది రోజులుగా వంట నూనెల ధరలు సలసలా కాగుతున్నాయి. మొన్నటి వరకు 100, 120 లోపు ఉన్న పామాయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్ ధరలు ప్రస్తుతం రూ.30 నుంచి రూ.40 వరకు పెరిగాయి. ప్రస్తుతం పామాయిల్ లీటర్ ధర రూ.145, సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.150 చేరింది. కంది కిలో రూ.165కి చేరింది. ఇక పప్పులు కిలో రూ.120, వేరుశనగ పప్పు రూ.130 ఇలా ఏ పప్పు దినుసులు చూసినా సెంచరీ పైనే ఉన్నాయి. మరో వైపు బెల్లం రూ.65, చక్కెర రూ.44కు చేరుకుంది. ఇక కొబ్బెర ఏకంగా రూ.180 నుంచి రూ.200 పలుకుతోంది. వీటితో కూరగాయల ధరల పోటీ పడుతున్నాయి. కేజీ ఉల్లి రూ.70, టమోట రూ.50, పచ్చిమిరప రూ.30, బీన్స్ రూ.120, క్యారెట్ రూ.60, బీట్‌రూట్ రూ.45, బీరకాయలు రూ.50 పలుకుతున్నాయి.

అమలు కాని రేట్లు

రాష్ట్ర ప్రభుత్వం అన్ని దుకాణాల్లో ఈనెలాఖరి వరకు వంట నూనెలు తక్కువ ధరలకు విక్రయిస్తున్నట్లు ప్రకటించింది. ఏ దుకాణంలోనూ ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు నూనెలు ఇవ్వడం లేదని ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వ చౌకధాన్యపు డిపోల ద్వారా ఇచ్చే కంది పప్పుకూడా 60 శాతం మందికే ఇస్తోందని, మిగిలిన వారికి అందడం లేదని అంటున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కార్డుదారులందరికి కందిపప్పు అందేలా చూడాలని, పెరిగిన ధరలను నియంత్రించాలని కోరుతున్నారు.

ధరలను నియంత్రించాలి



ప్రస్తుతం నిత్యావసర సరుకులు కొనాలంటేనే భయంగా ఉంది. నూనె, కందిపప్పు ధరలు విపరీతంగా పెరిగాయి. సామాన్యులు కొనలేని పరిస్థితి ఉంది. కూటమి ప్రభుత్వం స్పందించాలి.

-ఇడగొట్టు నాగరాజు, ఎం.కొత్తపల్లి, ఓడీసీ మండలం

పండుగ సంతోషం లేదు



సరుకులు, కూరగాయల రేట్లు చాలా పెరిగాయి. రూ.500 పెట్టినా పండక్కు తగినని సరుకులు, కారగాయలు రాలేదు. దీంతో ఏదో ఉన్నవాటితో పండగ చేసుకున్నాం. పండగ సంతోషం లేకుండా పోయింది.

-సుజాత, కొత్తచెరువు

అందరికీ కందిపప్పు ఇవ్వాలి



ప్రభుత్వ చౌకధాన్యపు డిపోల్లో కార్డుదారులందరికీ కందిబేడలు అందేలా చూడాలి. కందిబేడలు సగం మంది కూడా అందడం లేదు. బహిరంగ మార్కెట్‌లో స్టోర్ల కంటే రెట్టింపు ధర ఉంటోంది.

-నారాయణరెడ్డి, నారప్పగారిపల్లి, ఓడీసీ మండలం

కళాకారులకు ప్రోత్సాహం

నంబులపూలకుంట, అక్టోబరు 13: మండలంలోని సోమరాజుకుంటలో భక్త చింతామణి నాటకకళాకారులకు బీజేపీ రాష్ట్ర మైనార్టీ కార్యవర్గ సభ్యుడు బాబ్‌జాన్ ఆర్థిక సాయం అందచేశారు. శనివారం దసరా సందర్భంగా సోమరాజుకుంటలో నిర్వహించిన నాటకాన్ని ఆయన వీక్షించారు. కళకారులను ప్రోత్సహిస్తూ రూ.పది వేల నగదు అందజేశారు.



కళాకారులకు నగదును అందచేస్తున్న బాబ్‌జాన్

ఘనంగా ఉరుసు

నంబులపూలకుంట, అక్టోబరు 13: మండలంలోని వెలిచెలమల గ్రామంలో చిన్నకుళ్లాయిస్వామి ఉరుసును ఘనంగా నిర్వహించారు. శనివారం చిన్నకుళ్లాయి స్వామి ఊరేగింపు, సాయంత్రం గంథం, పాక దుంతలు, ఆదివారం తెల్లవారుజామున అగ్నిగుండ ప్రవేశం, అనంతరం ఊరేగింపు నిర్వహించారు.



చిన్నకుళ్లాయిస్వామిని ఊరేగిస్తున్న భక్తులు

విద్యార్థులకు పురస్కారాలు

పుట్టపర్తిరూరల్, అక్టోబరు 13 : పదో తరగతిలో ప్రతిభచాటిన 13 మంది విద్యార్థులను స్థానిక సాయిబృందావన్ హోటల్‌లో శనివారం సన్మానించారు. ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున 1.3 లక్షలను కమ్మ సంక్షేమ సంఘం నాయకులు అందజేశారు. ఇందులో ఆ సంఘం నాయకుడు కడియాల జయరాం, కడియాల వెంకట సుబ్బయ్య, లెక్కల రామచంద్ర, ఊరు వాకిలి సురేష్‌నాయుడు, లాయర్ క్రిష్టప్ప, గుట్టపల్లి గంగాధర్, విద్యార్థుల తల్లిదండ్రులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.



పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో నాయకులు

విద్యుత్ కోతలపై నిరసన



నిరసన తెలుపుతున్న రైతులు

ముదిగుబ్బ : మండలంలోని కొడవండ్లపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో తరచూ విద్యుత్ అంతరాయం ఏర్పడుతోందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం కొడవండ్లపల్లి సబ్‌స్టేషన్ గేటుకు తాళం వేసి రైతులు నిరసన చేశారు. విద్యుత్ అంతరాయంతో పంటలు ఎండుతున్నాయని సంబంధిత అధికారులు తక్షణ విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



కార్యక్రమంలో జబర్దస్త్ నటులు బుల్లెట్ భాస్కర్, నరేశ్, ఫైమా

పుట్టపర్తి, అక్టోబరు 13 : స్థానిక శిల్పారామంలో శనివారం రాత్రి దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. రాత్రి 8 గంటలకు జబర్దస్త ఆర్టిస్టులు బుల్లెట్ భాస్కర్, నరేశ్, ఫైమా బృందం గంట పాటు సందర్శకులను నవ్వులతో మైమరిపించారు. అనంతరం చిత్తూరు కళాతరంగిణి బృందం నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కళాబృందాన్ని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సన్మానించారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు

క్రైం న్యూస్..

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ధర్మవరం, అక్టోబరు 13: కడుపు నొప్పి తాళలేక శాంతినగర్‌కు చెందిన రవీంద్ర ఆదివారం ఆత్మహత్యకు యత్నించాడు. ఇతను గత కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్సలు చేయించుకున్నా ఫలితం లేకుండా పోయింది. దీంతో జీవితంపై విరక్తి చెందిన రవీంద్ర ఆదివారం తన ఇంట్లో విషద్రావకం తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

కదిరి అర్బన్, అక్టోబరు 13 : మండలంలోని నాగూరుపల్లి వద్ద ఆదివారం ఎదురురెదురుగా రెండు బైక్‌లు ఢీకొనడంతో నలుగురు గాయపడ్డారు. చిప్పలమడుగుకు చెందిన అంజనేయులు, రాజేష్ బైక్‌పై కదిరికి వస్తున్నారు. ఓడీసీకి చెందిన అనిల్, నాగూరుపల్లికి చెందిన వీరనారాయణ, కదిరి నుంచి నాగురూపల్లికి బయలుదేరారు. వీరి వాహనాలు ఎదురెదురుగా ఢీకున్నాయి. ఈప్రమాదంలో నలుగురూ గాయపడగా.. స్థానికులు 108 వాహనంలో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఆంజనేయులు, రాజేష్‌ను అనంతపురం తరలించారు.

ఇద్దరికి గాయాలు

ఓబుళదేవరచెరువు, అక్టోబరు 13: మండలంలోని మహమ్మదాబాద్ క్రాస్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నల్లమాడ మండలం దొన్నికోటకు చెందిన దైవాదీనం, తనకల్లు మండలం కొక్కంటికి చెందిన రామాంజనేయులు గాయపడ్డారు. వీరిద్దరూ బైక్‌పై వెళ్తూ కదిరి నుంచి మహమ్మదాబాద్ క్రాస్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి ఢీకొన్నారు. ప్రమాదంలో దైవాదీనంకు ఎడమచేయి విరగ్గా.. రామాంజనేయులుకు గాయాలయ్యాయి. ఘటనా స్థలాన్ని జమేదార్ వెంకటేష్ పరిశీలించారు. గాయపడిన వారిని 108 వాహనంలో ఓడీసీ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ధర్మవరంలో చోరీ

రూ.84 వేలు, 8.5 తులాల బంగారం అపహరణ

ధర్మవరం, అక్టోబరు 13 : స్థానిక రేగాటిపల్లి రోడ్డు పక్కన ఉన్న జర్నలిస్టుల కాలనీలో శనివారం రాత్రి చోరీ జరిగింది. కాలనీలో సచివాలయ ఉద్యోగి లావణ్య, చంద్రశేఖర్ దంపతులు నివాసముంటున్నారు. దసరా సెలవులకు అనంతపురానికి నాలుగు రోజుల క్రితం వెళ్లారు. ఇది గమనించిన దుండగులు శనివారం రాత్రి ఆ ఇంటి తలుపులు పగలకొట్టి బీరువాలోని రూ.84వేలు నగదు, ఎనిమిదన్నర తులాల బంగారు నగలను ఎత్తుకెళ్లారు. ఆదివారం రాత్రి అనంతపురం నుంచి ఇంటికి వచ్చిన లావణ్య.. ఇంట్లో దొంగతనం జరిగినట్లు గుర్తించి.. టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. టూటౌన్ సీఐ రెడ్డప్ప, హెడ్‌కానిస్టేబుల్ రామయ్య సిబ్బందితో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

17 గొర్రెల అపహరణ

ఓబుళదేవరచెరువు, అక్టోబరు 13: మండలంలోని మిట్టపల్లికి చెందిన మణిగే రంగయ్యనాయుడికి చెందిన రూ.2.50 లక్షల విలువైన 17 గొర్రెలు అపహరణకు గురయ్యాయి. రోజూ ఊరి బయట ఉన్న ఆలయం వద్ద గొర్రె మంద వద్ద రంగయ్య పండుకునేవాడు. శుక్రవారం అర్ధరాత్రి ఆరోగ్యం బాగలేక ఇంటికెళ్లాడు. దీన్ని అదునుగా తీసుకొని దుండగులు మందలోని 17 గొర్రెలను ఎత్తుకెళ్లారు. శనివారం చోరీ విషయాన్ని గుర్తించిన రంగయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి. మల్లికార్జునరెడ్డి తెలిపారు.



బత్తలపల్లిలో అమ్మవారి ఊరేగింపు



తాడిమర్రిలో అమ్మవారి ఊరేగింపులో వసంతోత్సవం

అట్టహాసంగా దసరా ఉత్సవాలు

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్ : జిల్లావ్యాప్తంగా పది రోజులుగా భక్తిశ్రద్ధలతో నిర్వహించిన దేవీశరన్నవ రాత్రి ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. చివరిరోజు కావడంతో శనివారం ఉదయం 6 గంటల నుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పలు ఆలయాల్లో అమ్మవార్లు వివిధ రూపాల్లో దర్శనమించ్చారు. ధర్మవరంలో అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. తాడిమర్రిలో ఆదివారం ఉదయం అమ్మవారిని ఊరేగిస్తూ వసంతోత్సవం నిర్వహించారు. బత్తలపల్లిలో ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహాన్ని ఆదివారం ఘనంగా ఊరేగించి.. నిమజ్జనం చేశారు. కొత్తచెరువులో పెద్దమ్మ తల్లి ఉత్సవ విగ్రహాన్ని అశ్వవాహనంపై ఉంచి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. తనకల్లులో శనివారం రాత్రి చౌడేశ్వరీ అమ్మవారిని ఏడు గుర్రాల వాహనంపై ఊరేగారు.



ధర్మవరం లక్ష్మీచెన్నకేశవపురంలో ఊరేగుతున్న దుర్గమ్మ

ఊరూరా దసరా సంబరాలు




పెనుకొండలో జమ్మిచెట్టువద్ద పూజలు నిర్వహిస్తున్న ప్రజలు, దుర్గామాతకు తమలపాకులతో అలంకరణ



మడకశిరలో ప్రత్యేక అలంకరణలో కన్యకాపరమేశ్వరి



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న రఘువీరారెడ్డి దంపతులు

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

దసరా నవరాత్రి వేడుకలు శనివారం విజయదశమితో ఘనంగా ముగిశాయి. ప్రతి పల్లెలోనూ దసరా సంబరాలు చేసుకున్నారు. అమ్మవారి ఆలయాలతో ఇతర దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెనుకొండలోని పురాతన ఆలయాలైన లక్ష్మీవెంకటరమణస్వామి, వాసవీకన్యకా పరమేశ్వరి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆఖరిరోజు జంబూసవారి పేరుతో వివిధ దేవతల ఊరేగింపుతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మైసూరులో నిర్వహించే జంబూసవారి తరహా పె నుకొండలోనూ ఉత్సవ విగ్రహాలను ఒకేసారి మేళతాళాలతో భజనలు, కో లాటం, చక్కభజన, భక్తిగీతాలతో ఊరేగింపుగా పట్టణ నడిబొడ్డున ఉన్న జమ్మిచెట్టుకు ప్రదక్షిణలు చేసి తిరిగి ఆలయానికి చేరుకున్నాయి. ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ రాఘవన్, ఎస్ఐ వెంకటేశ్వర్లు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. చంద్రగిరి గ్రామంలో శ్రీగిరిశక్తిపీఠంలో వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో పీఠాధిపతి దేవేంద్రస్వామి, సానిపల్లి ఈశ్వరయ్యస్వామి, మౌనగిరిపీఠం దత్త ఆనందగిరిస్వా మి, కోనశంకర్‌స్వామి, సహజానందస్వామి, శివయోగి స్వామి, ఆదినారాయణస్వామి పాల్గొన్నారు. చిలమత్తూరు మండలం కోడూరు, చిలమత్తూరు, దేమకేతేపల్లిలో చౌడేశ్వరీ అమ్మవారి ఆలయాల్లో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సోమఘట్టలో మధుగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. సోమందేపల్లిలోని పెద్దమ్మ తల్లి విగ్రహాన్ని, కన్యకాపరమేశ్వరి, అంబా భవానీ, ఇతర దేవతామూర్తులను ఊరేగించారు. మడకశిర పట్టణంలోని కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో చివరిరోజు అమ్మవారిని రాజ రాజేశ్వరీ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పావగడ రోడ్డులో వెలసిన చంద్రమౌళేశ్వరస్వామి, భోగరామలింగేశ్వరస్వామి, రామలింగేశ్వరస్వామి, షిర్డిసాయిబాబా, అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నీలకంఠాపురంలో మాజీ మంత్రి రఘువీరారెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జమ్మానిపల్లిలో లక్ష్మీ నిడిమామిడమ్మదేవి, ఛత్రంలో దుర్గమాతాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుడిబండ మండలంలో విజయదశమి పండుగను ఘనంగా జరుపుకొన్నారు. పావగడలో విజయదశమి వేడుకలను వైభవంగా జరుపుకొన్నారు. తహసీల్దార్ వరదరాజులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

హిందూపురం అర్బన్, అక్టోబరు 13: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించిన సంఘటన శనివారం పట్టణ పరిధిలోని చిన్నమార్కెట్ వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మడకశిర సి. కొడిగేపల్లికి చెందిన శ్రీరాములుకు హిందూపురం బోయపేట అమ్మాయితో వివాహమైంది. తరచు భార్యను కొడుతుండటంతో ఆమె పుట్టినింటికి వచ్చేసింది. శనివారం శ్రీరాములు భార్యను ఇంటికి రావాలని అడగగా నిరాకరించింది. దీంతో మనస్థాపానికి గురైన ఆయన ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యకు ప్రయత్నం చేశాడు. స్థానికులు గమనించి మంటలు ఆర్పి వెంటనే హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కార్మికుల సేవలు మరువలేనివి

సోమందేపల్లి, అక్టోబరు 13: పంచాయతీ కార్మికుల సేవలు మరువలేమని టీడీపీ సీనియర్ నాయకుడు హరిక్రిష్ణ తెలిపారు. శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికులకు బట్టలు, స్వీట్లు, నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండగ వేళ అందరూ సంతోషంగా ఉండాలనే ఉద్దేశ్యంతో కార్మికులకు తనవంతుగా సహకారాన్ని అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, మాజీ ఎంపీటీసీ కిష్టప్ప, కార్మికులు పాల్గొన్నారు.

నేడు వీరభద్రస్వామి అగ్నిగుండం

అగళి, అక్టోబరు 13: మండలంలోని మధుడి గ్రామంలో వెలసిన వీరభద్రేశ్వర స్వామి అగ్నిగుండ మహోత్సవం సోమవారం నిర్వహిస్తామని ఆలయ అర్చకులు తెలిపారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు, అలంకరణ, జమ్మిపూజ కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం అగ్నిగుండ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. మంగళవారం రథోత్సవాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

గుర్తుతెలియని శవం లభ్యం

హిందూపురం అర్బన్, అక్టోబరు 13: పట్టణ పరిధిలోని సూరప్పకుంటలో గుర్తు తెలియని పురుషుడి శవం ఆదివారం లభ్యమైనట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. స్థానికులు అక్కడ ఉన్న శవాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. రెండు రోజుల క్రితమే మురుగునీటిలో పడి ఉన్నట్లు పోలీసులు ధ్రువీకరించారు. చనిపోయిన వ్యక్తి ఎవరైనది తెలియరాలేదని పేర్కొన్నారు. పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ఎంపీని కలిసిన విద్యుత్‌శాఖ ఎస్ఈ

పెనుకొండ, అక్టోబరు 13 : విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ సురేంద్రబాబు హిందూపురం ఎంపీ బీకే పార్థసారధిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఆదివారం అనంతపురంలోని బీకే స్వగృహంలో ఆయన బీకేను కలిసి శాలువాకప్పి సన్మానించారు.

గాయపడిన వ్యక్తి మృతి

గోరంట్ల, అక్టోబరు 13: మండలంలోని వెంకటరమణపల్లికి చెందిన కోనప్పగారి జయప్ప (44) అనే వ్యక్తి ద్విచక్రవాహన ప్రమాదంలో గాయపడి, చికిత్స పొందుతూ ఆదివారం ఆసుపత్రిలో మృతిచెందినట్లు సీఐ శేఖర్ తెలిపారు. గ్రామానికి చెందిన చిన్ననరసింహప్పకుమారుడు జయప్ప ఈనెల10 సొంతపనిపై కర్ణాటకలోని బాగేపల్లికి ద్విచక్రవాహనంపై వెళ్లారు. స్వగ్రామానికి తిరిగి వస్తుండగా గ్రామ సమీపంలో అదుపు తప్పి ద్విచక్రవాహనం బోల్తాపడడంతో ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికంగా చికిత్స అనంతరం బెంగుళూరుకు తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య సుందన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ డ్రైవర్..

పెనుకొండ రూరల్, అక్టోబరు 13 : పట్టణ సమీపంలోని జాతీయ రహదారిపై ఐదు రోజుల క్రితం ఆగి ఉన్న లారీని కంటైనర్ వాహనం ఢీకొనడంతో గాయపడిన డ్రైవర్ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ దాదాపీర్ తెలిపారు. తిమ్మాపురం గ్రామానికి చెందిన సోమశేఖర్‌రెడ్డి అనే వ్యక్తి కియాలో కంటైనర్ వాహనం డ్రైవర్‌గా పనిచేస్తుడు. ఈనెల 8న సోమశేఖర్ రెడ్డి కియా నుంచి కంటైనర్‌లో సోమందేపల్లి వైపు వెళ్తున్నాడు. పెనుకొండ సమీపంలోకి రాగానే రహదారి పక్కన ఆగి ఉన్న లారీని వెనుకవైపు నుంచి కంటైనర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో కంటైనర్ వాహన డ్రైవర్ సోమశేఖర్‌రెడ్డి తీవ్ర గాయాలపాలయ్యాడు. ప్రథమ చికిత్స అనంతరం కర్నూలుకు తరలించారు. శనివారం రాత్రి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమశేఖర్‌రెడ్డి మృతిచెందాడు.

ఉషశ్రీని కలిసిన నాయకులు

సోమందేపల్లి, అక్టోబరు 13 : వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్‌ను ఆదివారం మండల కేంద్రంలోని జడ్పీటీసీ సభ్యుడు అశోక్ ఇంట్లో నూతనంగా ఎంపికైన పట్టణ అధ్యక్ష, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, మంజు కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. తమను ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. సీనియర్ నాయకులు రమాకాంత్‌రెడ్డి, తదితరులు ఆమెను కలిశారు. స్థానిక రాజకీయ పరిస్థితులపై ఆమె చర్చించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : ఆర్డీఓ




గోరంట్లలో మాట్లాడుతున్న పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, అగళిలో కంట్రోల్‌రూమ్‌ను పరిశీలిస్తున్న పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్

గోరంట్ల, అక్టోబరు 13: అధిక వర్షాలు రానున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండి ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలని పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ ఆదేశించారు. గోరంట్ల తహసీల్దార్ కార్యాలయంలో ఆమె అధికారులతో సమావేశం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది సహకారంతో రహదారులకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోలన్నారు. తాగునీరు కలుషితమై వ్యాధులు ప్రబలకుండా చూసుకోవాలని, విద్యుత్ శాఖవారు పరిశీలించి స్తంభాలు, లైన్లు వెంటనే మరమ్మతులు చేయాలని ఆదేశించారు. కోత దశలతో ఉన్న మొక్కజొన్న, వేరుశనగ, వరికి నష్టం కలగకుండా చర్యలు చేపట్టాలని, చెరువులను ఇరిగేషన్‌వారు పరిశీలించి, అవసరమైనచోట మరమ్మతులు చేపట్టాలన్నారు. ఆరోగ్య శాఖవారు వారం రోజుల్లో ప్రసవించే గర్భవతుల వివరాలు సేకరించి, పరిశీలిస్తూ 108కు మెడికల్ అధికారి, కంట్రోల్ రూమ్‌కు తెలపాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మారుతి, అధికారులు పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్‌ను సద్వినియోగం చేసుకోండి: ఆర్డీఓ

అగళి : ఈనెల 14నుంచి 16వరకు భారీ వర్షాలు పడనున్న నేపథ్యంలో ప్రజలు సౌకర్యార్థం తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్ తెలిపారు. ఆదివారం అగళి తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేస్తూ కంట్రోల్ రూమ్ పరిశీలించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఎక్కడా ప్రజలకు ఇ బ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఎక్కడైనా ఇబ్బంది కలిగితే కంట్రోల్‌రూమ్ 9948808499కు ఫోన్ చేయాలన్నారు. ఈ సందర్భంగా ఇన్చార్జ్ తహసీల్దార్ సుబ్బారావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తీర్చిన ఎమ్మెల్యే



బి.రాయపురంలో బోరు వేయించడంతో హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు

మడకశిర రూరల్, అక్టోబరు 13 : తమ గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి తీర్చారని బుళ్లసముద్రం పంచాయతీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బుళ్లసముద్రం మాజీ సర్పంచు జైపాల్ మాట్లాడుతూ బి.రాయపురం గ్రామంలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొందని, వైసీపీ పాలనలో ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఎన్నిల సమయంలో ప్రచారానికి వచ్చిన ఎంఎస్ రాజు,గుండుమల తిప్పేస్వామి తాగునీటి సమస్య సత్వరం పరిష్కరిస్తామిన హామీ ఇచ్చారని తెలిపారు. ఆ మాట ప్రకారం బి. రాయపురం గ్రామంలో ఆదివారం బోరు వేయించరాని, నీరు పుష్కలంగా పడ్డాయని వివరించారు. దీంతో గ్రామస్థులు అందరూ సంతోషం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాధాకృష్ణ, నాగేంద్ర, జనసేన నాయకులు నాగభూషణం, నాగేష్, కిశోర్ పాల్గొన్నారు.

అగళి : మండలంలోని ఇరిగేపల్లిలో తాగునీటి కోసం బోరుబావి తవ్వించారు. నీరు పుష్కలంగా పడ్డాయి. 20 ఏళ్ల నుంచి ఈ గ్రామంలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉండేదని ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, గుండుమల తిప్పేస్వామి చొరవతో అధికారులు స్పందించి బోరుబావి తవ్వించారని గ్రామస్థులు, స్థానిక సర్పంచ్ లక్ష్మమ్మ, శ్రీనివాసులు లింగరాజు, తదితరులు హర్షం వ్యక్తం చేశారు

టీడీపీలో చేరిన వైసీపీ నేతలు



టీడీపీలోకి ఆహ్వానిస్తున్న గుండుమల తిప్పేస్వామి

మడకశిరటౌన్, అక్టోబరు 13 : మండల పరిధిలోని పత్తికుంట గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి సమక్షంలో పార్టీ తీర్థాన్ని పుచ్చుకొన్నారు. ఆదివారం బాలాజీనగర్‌లో తెలుగుదేశం పార్టీలోకి చేరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేస్తున్నారని, తాము సైతం మద్దతు ఇచ్చేందుకు తెలుగుదేశం పార్టీలోకి చేరినట్లు నాయకులు తెలిపారు. పత్తికుంట గ్రామానికి చెందిన తిమ్మేగౌడ్, హనుమంతేగౌడ్, శశికుమార్, రాధాకృష్ణ, రంగప్ప, హనుమంతరాయప్ప, నాగరాజు, జగదీష్‌తోపాటు 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, నాయకులు రవీంద్రా రెడ్డి, సుధాకర్, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి పల్లె పండుగ వారోత్సవాలు

మడకశిర రూరల్, అక్టోబరు 13 : మండల వ్యాప్తంగా సోమవారం నుంచి పల్లె పండుగా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సోనియాబాయి, ఏపీఓ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. 14న గౌడనహళ్ళి, చందకచర్ల, ఆమిదాలగొంది పంచాయతీలు, 15న ఆర్.అనంతపురం, ఛత్రం, 16న హరేసముద్రం, వైబీ హళ్లి, 17న గుండుమల, కదిరేపల్లి, మెళవాయి, 18న గంగుళవాయిపాళ్యం, గోవిందాపురం, 19న బుళ్లసముద్రం, మణూరు, కల్లుమర్రి, 20న సి.కోడగేపల్లి పంచాయతీల్లో నిర్వహిస్తున్నాట్లు తెలిపారు. కార్యక్రమాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు అందరూ పాల్గొంటున్నట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

పెనుకొండ రూరల్, అక్టోబరు 13 : మండలంలోని కోనాపురం వెళ్లే ప్రధాన రహదారిలో గరండి బావివద్ద శనివారం ఉదయం హర్షవర్దన్ అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో గాయపడిన సంఘటన చోటుచేసుకుంది. స్థానికులు గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. కొండాపురం గ్రామానికి చెందిన రైతు వెంకటేష్‌రెడ్డి మల్బరీ పంట వేసుకున్నాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం వెంకటేశ్‌రెడ్డి కుమారుడు హర్షవర్దన్ మల్బరీ ఆకు కోసే కూలీలను పిలుచుకుని రావాలని ద్విచక్రవాహనంలో కోనాపురం బయలుదేరాడు. మార్గమధ్యంలో గరండి బావి వద్దకు రాగానే ఒక్కసారిగా అడవిపందులు రోడ్డుపైకి వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. హర్షవర్దన్‌కు తీవ్రగాయాలు కాగా పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు.

భక్తితోనే ప్రపంచశాంతి

హిందూపురం అర్బన్, అక్టోబరు 13: భక్తితోనే విశ్వశాంతి లభిస్తుందని నానెప్పనగర్ షిరిడి సాయి ఆలయం, అఖండ సాయినామ సప్తాహకమిటి అధ్యక్షుడు రంగస్వామి తెలిపారు. ఆదివారం ఆలయంలో షిరిడిసాయి 106వ సమాధి వేడుకలు నిర్వహించారు. 106 కొబ్బరికాయలు కొట్టి కొవ్వొత్తులు వెలిగించి మూలవిరాట్ బాబాను భక్తులు దర్శించుకున్నారు.

రైలుకింద పడి మహిళ ఆత్మహత్య

సోమందేపల్లి, అక్టోబరు 13 : మండల పరిధిలోని పందిపర్తి గ్రామ సమీపంలో రైలుకిందపడి రమాదేవి (45) అనే మహిళ మృతి చెందింది. రైల్వే పోలీసులు అందించిన సమాచారం మేరకు.. చాకలి శ్రీనివాసులు భార్య రమాదేవితో కలిసి బెంగళూరులో కూలిపని చేస్తున్నారు. రమాదేవికి గత కొన్నేళ్లుగా మానసిక ఆరోగ్యం సరిగాలేదు. దసరా పండగ సందర్భంగా సోమందేపల్లి మండల పరిధిలోని స్నేహలతనగర్‌కు బంధువుల ఇంటికి వచ్చారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలికి కొడుకు, కూతురు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

అనుకూలమైన ప్రాంతాల్లోనే అంగన్‌వాడీ కేంద్రాలు

మడకశిరటౌన్, అక్టోబరు 13 : తుఫాన్ ప్రభావం వల్ల భారీ వర్షం వచ్చే అవకాశం ఉందని, నియోజకవర్గం వ్యాప్తంగా ఏవైనా అంగన్‌వాడీ కేంద్రాలు కారడం, పడిపోయే స్థితిలో ఉన్నవాటిలో నిర్వహించకూడదని, మరోచోట నడపాలని ఐసీడీఎస్ పీడీ నాగమల్లేశ్వరీ తెలిపారు. ఈమేరకు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అందరూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. చిన్న పిల్లలకు టోపీలు వేసుకొనే విధంగా తల్లిదండ్రులకు సూచనలు చేయాలన్నారు. సురక్షిత ప్రాతాల్లో చిన్నారులు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు నీరివ్వండి

మంత్రి సవితకు జలసాధన సమితి వినతి

హిందూపురం అర్బన్, అక్టోబరు 13: గొల్లపల్లి రిజర్వాయర్ ద్వారా మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు నీరందించాలని జలసాధన సమితి నాయకులు బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవితకు వినతి అందించారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో గ్యాంగ్‌రేప్‌కు గురైన బాధితులను పరామర్శించేందుకు వచ్చిన మంత్రిని వారు కలిశారు. గొల్లపల్లి రిజర్వాయర్‌లో 1.10 టీ ఎంసీల నీరు ఉన్నప్పటికి మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు వదలడం లేదన్నారు. కాలువలో కంపచెట్లు, పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. నీరు వదిలినా పూర్తి స్థాయిలో రాలేని పరిస్థితి ఉందన్నారు. కాలువ పూడిక పనులను చేపట్టాలని తెలిపారు. బ్రాంచ్ కెనాల్ ద్వారా మడకశిర, హిందూపురం, పెనుకొండ ప్రాంతాల్లోని అన్ని చెరువులకు నీరందించాలన్నారు. మంత్రి సవిత స్పందిస్తూ.. ఇప్పటికే హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చెరువులకు నీరందించే దిశగా ప్రణాళిక చేశారని తెలిపారు. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఓపీడీఆర్ శ్రీనివాసులు, రైతుసంఘం నాయకులు ధనాపురం వెంకటరామిరెడ్డి, సిద్దారెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి సవితకు వినతి పత్రం ఇస్తున్న జలసాధన సమితి నాయకులు

టీడీపీ పట్టణాధ్యక్షుడికి రూ.5లక్షల సాయం



కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

మడకశిరటౌన్, అక్టోబరు 13 : తెలుగుదేశం పార్టీ మడకశిర పట్టణ అధ్యక్షుడు మనోహర్‌కు గుండె సమస్య తలెత్తడంతో శనివారం అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అత్యవసరంగా చికిత్స అవసరం అని వైద్యులు తెలపడంతో బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. దీంతో మనోహర్ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు రూ.3లక్షలు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామిలు రూ.2లక్షలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వారి కుటుంబసభ్యులకు పార్టీ నాయకులతోపాటు వ్యక్తిగత కార్యదర్శి స్వయంగా వెళ్లి అందజేశారు.

బైక్ ఢీకొని జింక మృతి



మృతిచెందిన జింక

చిలమత్తూరు, అక్టోబరు 13: మండలంలోని జాతీయ రహదారిపై కొడికొండ చెక్‌పోస్టు సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మూడేళ్ల వయసు గల జింక మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. రహదారిపై ఒక వ్యక్తి ద్విచక్రవాహనంలో వెళుతుండగా జింక వేగంగా రోడ్డు దాటే క్రమంలో వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడగా, జింక గాయపడి అక్కడే మృతి చెందింది. ద్విచక్రవాహనదారుడు స్వల్ప గాయాలతో బయటపడినట్లు తెలిపారు. ఘటనపై స్థానికులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు.

కిటకిటలాడిన రైళ్లు, బస్సులు



రైలులో సీట్లులేక కింద కూర్చుని ప్రయాణిస్తున్న దృశ్యం

పెనుకొండ, అక్టోబరు 13 : దసరా పండగకు వివిధ ప్రాంతాల నుంచి స్వగ్రామానికి వచ్చిన ఉద్యోగులు, ఇతరులు శనివారం ఆదివారం సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు, రైల్వే స్టేషన్ కిటకిటలాడాయి. బస్సుల్లో, రైళ్లలో కూర్చోవడానికి కూడా స్థలంలేక కింద కూర్చుని, నిలబడి ప్రయాణించారు.

హేమావతిలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సిద్ధేశ్వరస్వామి

అమరాపురం, అక్టోబరు 13 : మండలంలోని హేమావతి హెంజేరు సిద్ధేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ అభిషేకాలు, కుంకుమార్చన, రుద్రాభిషేకం, తైలాభిషేకం, పంచామృతాభిషేకం జరిపి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న కాలభైరవేశ్వరస్వామి, దొడ్డేశ్వరస్వామి, మల్లేశ్వరస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు శివకుమార్‌స్వామి, సిద్దలింగేశ్వర స్వామిలు, మహేష్‌కుమార్, గౌతమ్, ప్రదీప్ తెలిపారు.

నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి: సీపీఐ

హిందూపురం అర్బన్, అక్టోబరు 13: దుండగులు ఆడపిల్లల జోలికి వెళ్లాలంటే భయపడేలా చట్టాలను తయారు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ డిమాండ్ చేశారు. అగంతకులు అత్తాకోడళ్లపై జరిపిన సామూహిక అత్యాచారాన్ని తీవ్రంగా ఖండించారు. ఆదివారం తాలూకా పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకొని ఉన్నతాధికారులతో ఫోన్ మాట్లాడారు. అత్యాచారానికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో దేశంలో, రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, అఘాయిత్యాలు ఎక్కువయ్యాయని అయన మండి పడ్డారు. చట్టాలపై అవగాహన పెంచాలన్నారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా కఠినంగా శిక్షించేలా చట్టాలు తయారు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆంజనేయులు, పట్టణ కార్యదర్శి వినోద్‌కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, ఇస్మాయిల్, బాబు. చలపతి, మారుతిరెడ్డి తదితరులు ఉన్నారు.

కఠినంగా శిక్షించాలి

సోమందేపల్లి, అక్టోబరు 13 : చిలమత్తూరు మండలానికి వలస వచ్చిన ఇద్దరు మహిళలపై పాశవికంగా అత్యాచారానికి పాల్పడిన మానవమృగాలను కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి గౌతమి డిమాండ్ చేశారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ సోషల్ మీడియా, సెల్‌ఫోన్‌లో అశ్లీల, నీలిచిత్రాల ప్రభావం యువతపై చాలా ఉందన్నారు. ప్రభుత్వం వీటిని కట్టడి చేసేదిశలో చర్యలు తీసుకోవాలన్నారు. వయసుతో నిమిత్తం లేకుండా అత్యాచారాలు, దాడులు అధికమవుతున్నాయన్నారు. ప్రభుత్వం దోషులను పట్టుకుని తక్షణమే శిక్షలను అమలు చేయాలన్నారు. జిల్లాలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు విస్తరిస్తున్నాయన్నారు. వీటి ద్వారా నేరాలు పెట్రేగిపోవడానికి ఊతమిస్తున్నాయన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలన్నారు.

ఆధ్యాత్మికతతోనే సన్మార్గం

హిందూపురం అర్బన్, అక్టోబరు 13: ఆధ్యాత్మికతతోనే స న్మార్గం సాధ్యమని సిలోన్, జనరల్ మిషన్ చైర్మన్ త్యాగరాజు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సీఅండ్‌ఐజీ మిషన్ కాంపౌండ్ చ ర్చిలో పాస్టర్ అప్రిషియేషన్‌డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవంతుడు ప్రజలందరూ సన్మార్గంలో పయనించే విధంగా తీర్చిదిద్దుతున్నారని అన్నారు. కోపతాపాలతో ఒకరిపై ఒకరు ద్వేషాన్ని పెంచుకుంటే విధ్వంసాలకు దారి తీస్తుందన్నారు. దేశంలో ఆర్థిక, సామాజిక, సాంకేతిక అభివృద్ధిలో క్రైస్తవ మిషనరీల పాత్ర కీలకంగా ఉందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి బెంజమిన్ తిమోతి, వైస్ చైర్మెన్ ఐజయ్య, సంఘం పాస్టర్ స్టీఫెన్‌రాజ్, కార్యదర్శి డాక్టర్ ఎ.నాగేంద్రకుమార్, ఇతర ముఖ్యులు సాల్మన్‌రాజ్, దేవరాజ్, జార్జిబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులను సన్మానించారు.

నేడు అన్న క్యాంటిన్ ప్రారంభం

మడకశిరటౌన్, అక్టోబరు 13 : ఎందరో పేదలకు రూ.5లకే ఆకలి తర్చే అన్న క్యాంటిన్‌ను సోమవారం ఉదయం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి ప్రారంభించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్న క్యాంటిన్‌ను మూయించారు. వివిధ పనుల నిమిత్తం మడకశిర నియోజకవర్గ కేంద్రానికి వచ్చే అనేక మంది పేదలకు క్యాంటిన్ ఆకలి తీర్చనుంది. ఇందు కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.